


RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM



## విలేకరులు కావలెను

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0



ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :307 సంపాదకులు: కలిచేటి వెంకయ్య శనివారం 3 అక్టోబర్ 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad






# కరవు సీమను సిరులసీమగా మారుస్తాం

ఉద్యానరంగ అభివృద్ధితో ఆర్థికాభివృద్ధి

అగ్రికల్చర్ స్కూల్ ద్వారా వ్యవసాయ రంగంలో నైపుణ్యాలు పెంచుతాం

కేంద్ర సాయంతో రాష్ట్రాభివృద్ధి-ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సహకారాన్ని మరువలేం

గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ శంకుస్థాపన సభలో సీఎం చంద్రబాబు

రూ. లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కు శ్రీకారం

రిలయెన్స్ సంస్థ భాగస్వామ్యంతో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు శంకుస్థాపన

మదనపల్లెలో రెండు బృహత్తర ప్రాజెక్టులకు అంకురార్పణ చేసిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



**మదనపల్లె, సింధూరదర్శిని:** కరవుసీమగా పేరున్న రాయలసీమను సిరుల సీమగా మారుస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. 2024 ఎన్నికల్లో కూటమిని గెలిపించిన మరుక్షణం నుంచి ప్రజలకు మేలు చేయాలనే తలంపుతో ఉన్నామని... దాంట్లో భాగంగానే రాయలసీమలోని ఎనిమిది జిల్లాలు, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని ఉద్యాన రైతులకు మేలు చేసేలా గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం చుట్టామని చెప్పారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో శుక్రవారం గ్లోబల్ హార్టికల్చర్ హబ్-+ఎన, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్-×ూాకు శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ, మంత్రి నారా లోకేష్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రూ.లక్ష కోట్ల అంచనా వ్యయంతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌ను అభివృద్ధి చేయనున్నారు. కేంద్ర సహకారంతో రూ.40 వేల కోట్లు, ప్రైవేటు పెట్టుబడులతో మరో రూ.60 వేల కోట్లను సమీకరించేలా ప్రణాళికలు రూపొందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలు అన్న మహాత్మాగాంధీ ఆశయాన్ని సాకారం చేసే దిశగా రాయలసీమలో చారిత్రక కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సహకారంతో కరవుసీమను రూ.లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఉద్యాన రంగం ప్రాథమిక రంగం వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని, ప్రస్తుతం సుమారు రూ.1.50 లక్షల కోట్ల జీవీఏ అందిస్తున్న ఈ రంగం ద్వారా మరో రూ.లక్ష కోట్ల జీవీఏను సాధించాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. ఈ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ద్వారా 5,860 గ్రామాలను 201 క్లస్టర్లుగా అభివృద్ధి చేయడంతో పాటు అదనంగా 6లక్షల ఎకరాల్లో ఉద్యాన సాగును విస్తరించేలా ఈ ప్రాజెక్టులో కార్యాచరణ చేపట్టను న్నామన్నారు. రైతులకు ఉత్పత్తి నుంచి మిగతా 2లో...

# ప్రపంచానికి భారత ఆధ్యాత్మిక జ్ఞానం పరిష్కారం చూపుతుంది: మోహన్ భగవత్

భారత్‌లో ధర్మం, దేశం వేర్వేరు కాదని మోహన్ భగవత్ స్పష్టీకరణ-దేశానికి ధర్మమే ప్రయోజనమని, ధర్మమే దేశాన్ని నిలబెడుతుందని వ్యాఖ్య

ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు భారత్ పరిష్కారం చూపుతుందని వెల్లడి

భారతీయ జ్ఞానాన్ని కాపాడటం మానవాళి భవిష్యత్తును కాపాడటమేనని ఉద్ఘాటన



**న్యూఢిల్లీ:** భారతదేశంలో ధర్మం, దేశం వేర్వేరు కావని, ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానమే పరిష్కారం చూపగలదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన అఖిల భారత విహార్ సేవా గ్రూప్ 14వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా భగవత్ మాట్లాడుతూ, “మన దేశం, ధర్మం పరస్పర భిన్నమైనవి కావు. దేశానికి ధర్మమే ప్రాణాధారం, ధర్మమే దేశాన్ని సుస్థిరపరుస్తుంది. ఈ రెండూ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయి” అని స్పష్టం చేశారు. నేడు ప్రపంచం అభివృద్ధి-పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛ-కుటుంబ వ్యవస్థ, మత విశ్వాసం-సంఘర్షణ వంటి అనేక వైరుధ్యాలతో సతమతమవుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. “ప్రపంచం ప్రస్తుతం అస్తవ్యస్తంగా ఉంది. ఏ ఆనందమూ పరిపూర్ణంగా లభించడం లేదు. ఎక్కడా సమతుల్యత కనిపించడం లేదు, అతివాదం పెచ్చరిల్లుతోంది” అని ఆయన విశ్లేషించారు. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితులకు పరిష్కారం కోసం ప్రపంచం భారతదేశం వైపు ఆశగా చూస్తోందని భగవత్ అన్నారు. “ఈ సమస్యల నుంచి గట్టెక్కించే మార్గం భారత్ నుంచే మిగతా 2లో...

# అక్టోబరు 13 నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం

వాయుగుండంగా మారే చాన్స్ - బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

అక్టోబర్ 15 నాటికి వాయుగుండంగా బలపడే అవకాశం

వివరాలు వెల్లడించిన రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ

ఈ సీజన్‌లో ఏపీలో 34.9 శాతం మేర వర్షపాతం లోటు



**అమరావతి సింధూరదర్శిని:** నైరుతి రుతుపవనాల సీజన్‌లో తీవ్ర వర్షపాత లోటుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్‌కు వాతావరణానికి సంబంధించిన మరో కీలక అప్‌డేట్ వచ్చింది. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని, ఇది వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ శుక్రవారం వెల్లడించింది. దీని కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది. సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం, అక్టోబర్ 12వ తేదీన ఉత్తర అండమాన్ సముద్రంపై ఉపరితల ఆవర్తనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో అక్టోబర్ 13 నాటికి అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయి. ఈ అల్పపీడనం పశ్చిమ, వాయవ్య దిశగా ప్రయాణిస్తూ మరింత మిగతా 2లో...

# కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి హరీశ్ రావు లేఖ



**హైదరాబాద్ సింధూరదర్శిని:** తెలంగాణలోని కీలక విద్యుత్ రంగ సంస్థల్లో వాటాల విక్రయం లేదా ప్రైవేటీకరణ ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి లేఖ రాశారు. టీజీ ట్రాన్స్‌కోలో 26 శాతం వాటాలను ఐపీఓ ద్వారా విక్రయించి నిధులు సమీకరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో కాంగ్రెస్ జాతీయ నాయకత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజాధనంతో నిర్మితమైన టీజీ ట్రాన్స్‌కో, రాష్ట్ర విద్యుత్ సరఫరా వ్యవస్థకు వెన్నెముక వంటిదని హరీశ్ రావు తన లేఖలో పేర్కొన్నారు. వేలాది కిలోమీటర్ల మేర విస్తరించిన విద్యుత్ లైన్లు, హై-వోల్టేజ్ సబ్‌స్టేషన్లతో కూడిన ఈ సంస్థ అత్యంత విలువైన ఆస్తి అని వివరించారు. ట్రాన్స్‌కోలో ప్రైవేట్ వాటాలకు అనుమతినిస్తే, మిగతా 2లో...

# బీసీలకు చంద్రబాబు మరోసారి వెన్నుపోటు పొడిచారు: బొత్స



**విజయవాడ సింధూరదర్శిని:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీలకు మరోసారి వెన్నుపోటు పొడిచారని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ తీవ్ర విమర్శలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు రద్దు చేసిన నేపథ్యంలో ఆయన స్పందించారు. ఈ జీవో న్యాయపరంగా నిలవదని తెలిసినా, కేవలం రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారని మండిపడ్డారు. “రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టంగా తీర్పు ఇచ్చింది. ఈ విషయం తెలిసి కూడా చంద్రబాబు బీసీలను మోసం చేసేందుకు ఈ జీవో ఇచ్చారు. ఇప్పుడు హైకోర్టు కొట్టేయడంతో సుప్రీంకోర్టుకు వెళతానని చెప్పడం బీసీలను మరోసారి మభ్యపెట్టడమే” అని బొత్స అన్నారు. ప్రభుత్వానికి బీసీల పట్ల మిగతా 2లో...

## ప్రపంచానికి భారత ఆధ్యాత్మిక జ్ఞానం పరిష్కారం చూపుతుంది

(మొదటిపేజీ తరువాయి)

వస్తుందని ప్రపంచ దేశాలకు తెలుసు" అని ఆయన వ్యాఖ్యానించారు. వేదాలు, ఉపనిషత్తులు, రామాయణం భారతాలు, భగవద్గీతతో పాటు జైన ఆగమాలు, త్రిపిటకాలు, గురు గ్రంథ్ సాహిబ్ వంటి అత్యున్నత జ్ఞాన సంపద మన దేశానికి ఉందని గుర్తుచేశారు. ఈ జ్ఞానాన్ని పుణికిపుచ్చుకున్న వారిని, వారి సంప్రదాయాలను కాపాడటం కేవలం ఒక మతపరమైన బాధ్యత మాత్రమే కాదని, అది సమస్త మానవాళికి చేసే సేవ అని కొనియాడారు. "మీరు కేవలం ఒకరి ప్రాణాన్ని కాపాడటం లేదు, మొత్తం మానవజాతి సురక్షిత భవిష్యత్తును రక్షిస్తున్నారు" అని భగవత్ ఉద్ఘాటించారు.

## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి హరీశ్ రావు లేఖ

(మొదటిపేజీ తరువాయి)

భవిష్యత్తులో టీజీ జెన్‌కో, సింగరేణి, డిస్కమ్‌ల ప్రైవేటీకరణకు కూడా ఇది మార్గం సుగమం చేస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కాంగ్రెస్ పార్టీ 2019 ఎన్నికల మేనిఫెస్టో, 2023 రాయ్‌పూర్ తీర్మానాలకు విరుద్ధమని హరీశ్‌రావు ప్రశ్నించారు. వ్యూహాత్మకంగా ప్రాధాన్యత లేని, నష్టాల్లో ఉన్న సంస్థల్లో మాత్రమే పెట్టుబడుల ఉపసంహారణకు కట్టుబడి ఉన్నామని గతంలో కాంగ్రెస్ ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసీ వంటి సంస్థలను ప్రైవేటీకరిస్తుంటే తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్, రాష్ట్రంలో అధికారంలోకి రాగానే అందుకు భిన్నంగా వ్యవహరించడం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని నిలదీశారు. విద్యుత్ సంస్థల యాజమాన్య హక్కులపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, ప్రైవేటీకరణ, వాటాల విక్రయం లేదా పబ్లిక్ ఇష్యూపై ఇప్పటి వరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని టీజీ ట్రాన్స్‌కో వర్గాలు వెల్లడించాయి.

## బీసీలకు చంద్రబాబు మరోసారి వెన్నుపోటు పొడిచారు: బొత్స

(మొదటిపేజీ తరువాయి)

నిజంగా చిత్తశుద్ధి ఉంటే, పార్లమెంటులో రాజ్యాంగ సవరణ కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లను వైసీపీ అడ్డుకుంటోందని టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని బొత్స మండిపడ్డారు. వెన్నుపోటు పార్టీలో ఉన్న బీసీ నాయకులు ఇప్పటికైనా చంద్రబాబు మోసాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేయడానికి బీసీ రిజర్వేషన్ల అంశాన్ని సాకుగా చూపవద్దని హితవు పలికారు. బీసీలకు చట్టబద్ధంగా రిజర్వేషన్లు దక్కేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు.

## అక్టోబరు 13 నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం

(మొదటిపేజీ తరువాయి)

బలపడనుంది. అక్టోబర్ 15 నాటికి ఇది దక్షిణ, మధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో వాయుగుండంగా మారవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో దీని గమనం, తీవ్రతపై మరింత స్పష్టత వస్తుందని, వాతావరణ పరిస్థితులను బట్టి మార్పులు ఉండవచ్చని పేర్కొన్నారు. కాగా, ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో (జూన్ 1 - సెప్టెంబర్ 30) రాష్ట్రంలో సాధారణం కంటే చాలా తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో సగటున 589.7 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా, కేవలం 383.6 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 34.9 శాతం వర్షపాత లోటు ఏర్పడింది. ఈ నేపథ్యంలో బంగాళాఖాతంలో ఏర్పడనున్న ఈ వాతావరణ వ్యవస్థ ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయా లేదా అనే అంశంపై ఆసక్తి నెలకొంది.

## మోదీని 'మీరు నా ఆరాధ్య దైవం' అంటూ స్మిత్ భావోద్వేగం

**ఫ్లైదుబాయ్ హీరో పైలట్ స్మిత్ మచ్ఛర్‌కు ఫోన్ చేసిన ప్రధాని మోదీ**

**స్మిత్ ధైర్యసాహసాలను కొనియాడి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**

**వైద్య సహాయంతో పాటు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చిన ప్రధాని**



సింధూరదర్శిని:విమానంలో తోటి పైలట్ దాడిని ఎదుర్కొని, 174 మందికి పైగా ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన ఫ్లైదుబాయ్ విమాన కెప్టెన్ స్మిత్ మచ్ఛర్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం యూఏఈలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్మిత్ యోగక్షేమాలను ప్రధాని అడిగి తెలుసుకున్నారు. ఆయన ధైర్యసాహసాలను కొనియాడుతూ, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రధాని నుంచి ఫోన్ కాల్ రావడంతో స్మిత్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తనకు అతిపెద్ద ఆరాధ్య దైవం, ఆదర్శప్రాయుడు ప్రధాని మోదీయేనని, ఆయనతో మాట్లాడే అవకాశం వస్తుందని కలలో కూడా ఊహించలేదని ఆనందం వ్యక్తం చేశారు. దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కాక్‌పిట్‌లో ఉన్న కెప్టెన్ స్మిత్ మచ్ఛర్‌పై తోటి పైలట్ కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడి కుప్పకూలినప్పటికీ, స్మిత్ అసామాన్యమైన ధైర్యాన్ని ప్రదర్శించారు. చివరి క్షణంలో కాక్‌పిట్ డోర్ లాచ్‌ను నొక్కి తలుపు తెరిచారు. దీంతో ప్రయాణికులు వెంటనే లోపలికి ప్రవేశించి, దాడి చేస్తున్న పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. స్మిత్ సమయస్ఫూర్తి వల్ల 9/11 తరహా పెను ప్రమాదం తప్పిందని, 174 మందికి పైగా సురక్షితంగా బయటపడ్డారని ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానితో సంభాషణ సందర్భంగా స్మిత్ ఒక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. తాను కష్ట సమయాల్లో ఉన్నప్పుడు హనుమాన్ చాలీసా పఠిస్తానని, విమానంలో దాడి జరిగినప్పుడు కూడా ప్రాణాలతో పోరాడుతూ హనుమాన్ చాలీసానే చదువుకున్నానని వివరించారు. అనంతరం ప్రధాని మోదీ, స్మిత్ తల్లి గీతా బెన్‌తో కూడా మాట్లాడారు. భగవద్గీత విలువలు, బోధనలతో కుమారుడిని పెంచినందుకు ఆమెను అభినందించారు. స్మిత్ త్వరగా కోలుకోవడానికి అవసరమైన వైద్య సహాయంతో పాటు అన్ని విధాలుగా కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రధాని మోదీ వారి కుటుంబానికి భరోసా ఇచ్చారు.

# కరవుసీమను సిరులసీమగా మారుస్తాం





(మొదటిపేజీ తరువాయి)

మార్కెటింగ్, ప్రాసెసింగ్, ఎగుమతుల వరకు సమగ్ర మద్దతు అందించడమే హార్టికల్చర్ హబ్ ప్రధాన ఉద్దేశమని సీఎం చంద్రబాబు చెప్పారు. పంటల స్థిరీకరణతో పాటు ధరల స్థిరీకరణకు చర్యలు తీసుకోనున్నామని తెలిపారు. యాపిల్, స్ట్రాబెరీ నుంచి అరటి, ఆవకాడో, కివీ, ఖర్జూరం వరకు వివిధ రకాల ఉద్యాన పంటలకు ప్రోత్సహం అందించనున్ననట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రిటెక్, లాజిస్టిక్స్, అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి రంగాలను అభివృద్ధి చేసి రైతులకు మేలు చేసే వ్యవస్థలను అందుబాటులోకి తెస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. సీడ్ టు షిప్‌మెంట్ వ్యవస్థల ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించేలా కార్యక్రమాలను అమలు చేయనున్నామని సీఎం వెల్లడించారు.

### సాగునీరందిస్తాం... బంగారం పండించండి



సాగునీరు అందిస్తే రాయలసీమ ప్రజలు బంగారం పండిస్తారని, మార్కెటింగ్ ద్వారా సంపద సృష్టిస్తారని సీఎం పేర్కొన్నారు. హంద్రీ-నీవా, గాలేరు-నగరి తదితర సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామని, రూ.3,500 కోట్లతో హంద్రీ-నీవా కాలువను పూర్తి చేసి కుప్పం వరకు నీటిని తీసుకెళ్లామని చెప్పారు. వెలిగొండ మొదటి దశను పూర్తి చేసి మార్కాపురానికి, పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీటిని అందించామని వివరించారు. మరో రూ.35 వేల కోట్లతో 36 ప్రాధాన్య ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని సీఎం తెలిపారు. రాయలసీమలో హంద్రీ-నీవా, మడకశిర బ్రాంచ్ కెనాల్, మల్లెమడుగు, బాలాజీసాగర్, అప్పర్ పేరూరు తదితర ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో వంటి పరిస్థితుల కారణంగా వ్యవసాయ రంగంలో సవాళ్లు పెరుగుతున్నాయని సీఎం అన్నారు. గోదావరిలో ఈ ఏడాది కూడా సుమారు 1,600 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లిందని, పట్టిసీమ ద్వారా పదేళ్లలో సుమారు 500 టీఎంసీల నీటిని కృష్ణా డెల్టాకు తరలించామని తెలిపారు. కృష్ణా డెల్టాలో పొదుపు చేసిన నీటిని రాయలసీమకు తరలించడం నదుల అనుసంధానం వల్లే సాధ్యమైందన్నారు. వచ్చే ఏడాది పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని సీఎం తెలిపారు.

పవర్ గ్రిడ్, రోడ్ గ్రిడ్, డిజిటల్ కనెక్టివిటీ మాదిరిగా వాటర్ గ్రిడ్ అవసరమని చెప్పారు. గోదావరి నుంచి కావేరి వరకు నీటిని అనుసంధానం చేసే అంశాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గోదావరి-కావేరి అనుసంధానంతో రాయలసీమ కరవు తీరడంతోపాటు... దక్షిణాదిలోని 4 రాష్ట్రాల మధ్య నెలకొనే నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. రిలయన్స్ సంస్థ సహకారంతో మదనపల్లెలో ఏర్పాటు కానున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ద్వారా వ్యవసాయం, ఉద్యానవనం, ఆధునిక సాంకేతికత, పరిశోధన, కృత్రిమ మేధ వంటి రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించేలా ఈ సంస్థను తీర్చిదిద్దనున్నట్టు వెల్లడించారు. ఐఐఎంలో మేనేజ్‌మెంట్ నిపుణులు, ఐఐటీలో సాంకేతిక నిపుణులు, ఐఎస్‌బీలో పారిశ్రామిక నైపుణ్యాలు అభివృద్ధి చెందినట్లే.. ఐఎస్ఏ ద్వారా వ్యవసాయ రంగంలో నాయకత్వ నైపుణ్యాలు కలిగిన నిపుణులను తయారు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు తెలిపారు.



### ఉక్కు మహిళ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాష్ట్రానికి, దేశ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు అందిస్తున్న సహకారాన్ని సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. అమరావతి, విశాఖ ఉక్కు, పోలవరం తదితర ప్రాజెక్టులకు కేంద్రం సహకరిస్తోందన్నారు. దేశ నిర్మాణంలో నిర్మలా సీతారామన్ కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. జీఎస్టీ నెక్ట్స్‌జెన్ సంస్కరణలు, డీబీటీ ద్వారా సంక్షేమ పథకాల్లో పారదర్శకత, ఆర్థిక వ్యవస్థలో సంస్కరణల ద్వారా దేశాన్ని బలోపేతం చేస్తున్న ఉక్కు మహిళ నిర్మలా సీతారామన్ అని సీఎం అన్నారు. ఓ మహిళే ఇంటిని చక్కగా తీర్చిదిద్దే సత్తా మహిళకు మాత్రమే ఉంటుందని.. అదే విధంగా దేశ ఆర్థిక వ్యవస్థను నిర్మలా సీతారామన్ తీర్చిదిద్దుతున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆమెకున్న నాయకత్వ పటిమను గుర్తించే ప్రధాని మోదీ ఆర్థిక శాఖ బాధ్యతలు అప్పగించారన్నారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కు నిధులు కేటాయించే విషయంలో నిర్మలా సీతారామన్ చూపిన చొరవను.. ఇచ్చిన సహకారాన్ని మరువలేమన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఈ స్థాయిలో అభివృద్ధి-సంక్షేమం చేయగలుగుతోందంటే దానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అలాగే మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన రిలయెన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ అనంత్ అంబానీ తన పెద్ద మనస్సును చాటుకున్నారన్నారు. వ్యవసాయం, ఉద్యాన రంగాల్లో పరిశోధన, ఆధునిక సాంకేతికత, ఏఐ వినియోగంతో పాటు రైతులకు అవసరమైన మద్దతు వ్యవస్థలను అభివృద్ధి చేయడంలో రిలయన్స్ సంస్థ సహకారం అందించాలని సీఎం చంద్రబాబు కోరారు. సీడ్ టు షిప్‌మెంట్, అగ్రిటెక్, లాజిస్టిక్స్, అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో మరింతగా భాగస్వామ్యం కావాలని సూచించారు. తిరుమల శ్రీవారిపై భక్తితో ఈవీ బస్సులను సమకూర్చిన అనంత్ అంబానీ సేవలను సీఎం ప్రస్తావించారు. అలాగే అనంత్ అంబానీ వంతారా వంటి వ్యవస్థను ఏర్పాటు చేసి జంతువులకు సైతం సేవలు అందిస్తున్న గొప్ప పర్యావరణ ప్రేమికుడు అనంత్ అంబానీ అని కొనియాడారు. అనంత్ అంబానీ తన తాత, తండ్రుల వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని వారి బాటలో నడుస్తున్నారని సీఎం చంద్రబాబు చెప్పారు.

### ప్రత్యేక ఆకర్షణగా అనంత్ అంబానీ

రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ అనంత్ అంబానీ ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్‌తో తన అనుబంధాన్ని చాటుకుంటూ భావోద్వేగంగా ప్రసంగించారు. తనను ఆంధ్రా బిడ్డగా భావించాలని, రాష్ట్రానికి తాను ఏం చేయగలనో మార్గనిర్దేశం చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కార్యక్రమంలో ఆయన ప్రసంగం ఆకట్టుకుంది. అనంత్ అంబానీ ప్రసంగం అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆయనను అభినందించారు. అనంతరం సీఎం చంద్రబాబు అనంత్ అంబానీని ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఆ తర్వాత ప్రసంగించిన ముఖ్యమంత్రి అనంత్ అంబానీ చెప్పిన మాటలను స్పందించారు. అనంత్ అంబానీని ఆంధ్రప్రదేశ్ ముద్దుబిడ్డగా భావిస్తున్నామని సీఎం వేదికపై ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధిలో రిలయన్స్ సంస్థ మరింతగా భాగస్వామి కావాలని ఆకాంక్షించారు. ఈ సమావేశం సందర్భంగా సభలో వక్తల ప్రసంగాలకు ముందు ప్రత్యేక వీడియో ప్రజెంటేషన్ ఇచ్చారు. రాయలసీమలో ఉద్యాన రంగం అభివృద్ధి, రైతుల ఆదాయ పెంపు, నీటి వనరుల వినియోగం, ఆధునిక సాగు విధానాలు, ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఎగుమతుల అవకాశాలను ఈ వీడియోలో వివరించారు. కార్యక్రమం అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మొక్కలను నాటారు. అలాగే ఉద్యాన రంగానికి సంబంధించి ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, బీసీ జనార్దన్ రెడ్డి, రాంప్రసాద్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు, అన్నమయ్య జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపునకు మోదీ దగ్గర చాలా మంచి ఆలోచనలు ఉన్నాయి: పుతిన్ ప్రశంసలు

**యుద్ధం ముగించాలని మోదీ సూచిస్తున్నారన్న పుతిన్ - ప్రతి భేటీలో అంశాన్ని ప్రస్తావిస్తున్నారని వెల్లడి**

**ఉక్రెయిన్ యుద్ధం విషయంలో మోదీ వైఖరి తటస్థమన్న పుతిన్ - చర్చలు, దౌత్యానికే మోదీ ప్రాధాన్యమిస్తున్నారని వ్యాఖ్య**

సింధూరదర్శిని:ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న ప్రయత్నాలపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసలు కురిపించారు. మోదీకి పరస్పర అంగీకారంతో సమస్య పరిష్కరించేలా చాలా మంచి ఆలోచనలు ఉన్నాయని చెప్పారు. భారత్, రష్యా మధ్య స్నేహపూర్వక సంబంధాలు ఉన్నప్పటికీ.. ఉక్రెయిన్ వివాదానికి ముగింపు పలకాలని మోదీ ప్రతిసారి తనతో ప్రస్తావిస్తారని పుతిన్ తెలిపారు. మాస్కోలో గురువారం జరిగిన వాల్డాయ్ డిస్కషన్ క్లబ్ సమావేశంలో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ వివాదాన్ని ముగించే అంశాన్ని మోదీ ప్రతి సమావేశంలోనూ లేవనెత్తుతారని చెప్పారు. శాంతియుత పరిష్కారం కోసం మోదీకి ఆసక్తి ఉందని, సమస్యకు ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనేందుకు ఆయన మంచి సూచనలు ఇస్తున్నారని పుతిన్ పేర్కొన్నారు. ఉక్రెయిన్ విషయంలో మోదీ తటస్థ వైఖరిని కొనసాగిస్తున్నారని పుతిన్ అన్నారు. అదే సమయంలో యుద్ధానికి ముగింపు రావాలన్న ఆసక్తిని స్పష్టంగా వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఈ విషయంలో మోదీ చేస్తున్న ప్రయత్నాలకు రష్యా




కృతజ్ఞతలు చెబుతోందని పేర్కొన్నారు. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా మోదీ, పుతిన్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై ఇద్దరు నేతలు చర్చించారు. ఘర్షణలకు పరిష్కారం చూపేందుకు చర్చలు, దౌత్య మార్గమే ముందుకు వెళ్లే దారి అని మోదీ మరోసారి స్పష్టం చేశారు. శాంతి ప్రయత్నాలకు భారత్ సహకరించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం 2022 ఫిబ్రవరిలో ప్రారంభమైంది. అప్పటి నుంచి మోదీ పలుమార్లు యుద్ధానికి ముగింపు పలకాలని, చర్చలు, దౌత్యం ద్వారా సమస్యను పరిష్కరించాలని పిలుపునిచ్చారు.

# పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు గుర్తించుకోవాలి

**ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్**




గూడూరు( సింధూర దర్శిని) 2 అక్టోబర్ నెల్లూరు జిల్లా; ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాలనలో రాష్ట్రమెంతో అభివృద్ధి సాధిస్తుందని పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద గాంధీ జయంతి సందర్భంగా ఆర్యవైశ్యులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పాల్గొని మహాత్మా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో ప్రధానమంత్రి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సంకల్ప అభ్యాన కార్యక్రమం లో భాగంగా గత గత నెల 17వ తేదీ నుండి దేశవ్యాప్తంగా అనే కార్యక్రమాలు జరుగుతున్నా యని తెలిపారు. శుక్రవారం ఉచిత వైద్య శిబిరం రక్తదానం పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారని ప్రధానమంత్రి మోడీ సహకారంతో రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధించిందని అన్నారు. టిడిపి ప్రభుత్వంలోనే ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో అనేక వసతులు కల్పించామని అసంపూర్తిగా నిలిచిపోయిన నూతన హాస్పిటల్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపర్డెంట్ షరీనా, ప్రసన్న హెచ్ డిసి సభ్యులు కిరణ్‌కుమార్, చెంచు రామయ్య, టిడిపి రాష్ట్ర కార్యదర్శి, కందుకూరు నియోజకవర్గ పరిశీలకులు మట్టం శ్రావణి రెడ్డి , రహీం వైయస్సార్ చంద్రమౌళి ,ఆర్యవైశ్య సంఘ నాయకులు సోమిశెట్టి చెంచురామయ్య, భాస్కర్, సురేష్, సతీష్ ,రత్తయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.





# నెల్లూరు సిటీలో తొలి స్టేడియానికి శ్రీకారం

**పాలిటెక్నిక్ కాలేజీలో స్పోర్ట్స్ హబ్**
**అధునాతన క్రికెట్ స్టేడియానికి శంకుస్థాపన**
**వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు భూమిపూజ**
**స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి నారాయణ**

నెల్లూరు( సింధూరదర్శిని) 2 అక్టోబర్ నెల్లూరు జిల్లా; నెల్లూరు సిటీ నియోజకవర్గంలో క్రీడా రంగానికి కొత్త ఊపిరి పోసేలా తొలి స్టేడియం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రాంగణంలో అధునాతన క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ శంకుస్థాపన చేశారు. అదే ప్రాంగణంలో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులకు భూమిపూజ చేసి, మొక్కలు నాటారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ భారత్ కార్యక్రమాల్లో భాగంగా రోడ్లను శుభ్రం చేసి పారిశుధ్య కార్మికులను సన్మానించారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. స్వచ్ఛాంధ్ర సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహి స్తోంది. ప్రతి నెలా మూడో శనివారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలకు కేటాయిస్తున్నారన్నారు.స్వచ్ఛాంధ్ర సాధనలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం 153 లక్షల టన్నుల చెత్తను వదిలేసి వెళ్లింది. ఆ చెత్తనంతా క్లియర్ చేస్తున్నాం. భవిష్యత్తులో నగరాల్లో చెత్త కుప్పలు కనిపించకుండా చర్యలు తీసుకుంటు న్నామన్నారు. వైజాగ్, గుంటూరులో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్లు పనిచేస్తున్నాయని. మరో ఆరు ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.అవి పూర్తయితే ఏ రోజు చెత్తను అదే రోజు ప్రాసెస్ చేసి బర్న్ చేసే పరిస్థితి వస్తుందని తెలిపారు.

### మూడు దశల్లో స్పోర్ట్స్ హబ్

ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశామని, పనులను వెంటనే ప్రారంభించి మూడు దశల్లో పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు. అధునాతన క్రికెట్ స్టేడియంతో పాటు క్రీడలకు అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేసి కాలేజీ ప్రాంగణాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. గొడ్డలి పార్టీ రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించి వెళ్లిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన అపార అనుభవంతో రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలోకి తీసుకువెళుతున్నారన్నారు.పేదలకు శాశ్వత నివాస పత్రాలు ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వం పట్టాల పేరుతో ప్రజలను మోసం చేసిందని విమర్శించారు .ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చి మాట నిలబెట్టుకుంటామని పేర్కొన్నారు.

### ప్రభుత్వ విద్యాసంస్థలకు మహర్దశ

ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో స్పోర్ట్స్ హబ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మంత్రి నారాయణ నెల్లూరు నగరంలోని ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నారని, ప్రభుత్వ పాలిటెక్నిక్, ఐటీ, కేఏసీ కాలేజీల అభివృద్ధికి కూడా బాటలు వేస్తున్నారని తెలిపారు. స్పోర్ట్స్ హబ్ ఏర్పాటుతో పాలిటెక్నిక్ కాలేజీకి మహర్దశ వస్తుందన్నారు. వేల కోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చి నెల్లూరును అభివృద్ధి చేస్తున్న మంత్రి నారాయణకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మేయర్ సుజాత, కమిషనర్ నందన్, పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ రామారావు, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నేతలు దొడ్డపనేని రాజానాయుడు, జహీర్, తిరుపతయ్య, సుధాకర్‌రెడ్డి, చంద్రమౌళి, జమీర్ తదితరులు పాల్గొన్నారు.





# ఖైదీలలో పరివర్తన తీసుకొచ్చే సంస్కరణల కేంద్రంగా తీర్చిదిద్దాలి

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి నరసింహమూర్తి, కలెక్టర్ హిమాన్షు శుక్ల పిలుపు**

**గాంధీ జయంతి సందర్భంగా జిల్లా కేంద్ర కారాగారంలో ఖైదీల సంక్షేమ దినోత్సవం**

నెల్లూరు (సింధూర దర్శిని) 2 అక్టోబర్ నెల్లూరు జిల్లా ; ఖైదీలలో పరివర్తన తీసుకొచ్చి, వారు విడుదలైన తర్వాత సమాజంలో గౌరవప్రదంగా జీవించేలా తీర్చిదిద్దడమే కారాగారాల ప్రధాన లక్ష్యమని జిల్లా ప్రధాన న్యాయ మూర్తి నరసింహమూర్తి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పేర్కొన్నారు. ఖైదీలకు వృత్తి నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.గాంధీ జయంతిని పురస్క రించుకుని శుక్రవారం వెంకటాచలం మండల పరిధిలోని చెముడు గుంట సమీపంలో గల జిల్లా కేంద్ర కారా గారంలో నిర్వహించిన ఖైదీల సంక్షేమ దినోత్సవ వేడుకలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అక్కిరెడ్డి నరసింహమూర్తి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్. శ్రీనివాస్, ఏఎస్పీ సౌజన్య తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ కారాగారంలోని వివిధ విభాగాలను, ఖైదీలు తయారు చేస్తున్న ఉత్పత్తుల కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎవరూ పుట్టుక తోనే నేరస్థులు కారని, వ్యక్తుల సామాజిక, ఆర్థిక పరిస్థి తులు, ఎదురైన పరిస్థితులు వారి జీవితాలపై ప్రభావం చూపుతాయని అన్నారు. నేరానికి దారితీసిన పరిస్థితు లను అర్థం చేసుకుని, ఖైదీలలో సానుకూల మార్పు తీసుకురావాలని సూచించారు. కారాగారాలను కేవలం శిక్ష అనుభవించే ప్రదేశాలుగా కాకుండా, వ్యక్తులలో పరివర్తన తీసుకొచ్చే సంస్కరణల కేంద్రాలుగా భావించా లని తెలిపారు.కారాగారంలో ఖైదీలు తయారు చేస్తున్న ఉత్పత్తులను కలెక్టర్ అభినందించారు. ప్రభుత్వ పాఠశాల లకు అవసరమైన బెంచీలు సహా ఇతర ఉత్పత్తులను ఖైదీల ద్వారా సమకూర్చుకునే అవకాశాలను పరిశీలిస్తా మని చెప్పారు. దీనివల్ల ఖైదీలకు పని కల్పించడంతో పాటు వారి నైపుణ్యాలను అభివృద్ధి చేయవచ్చని పేర్కొ న్నారు. నెల్లూరు జిల్లాలో పరిశ్రమలు విస్తరిస్తున్న నేపథ్యంలో ఖైదీలకు వెల్డింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ వంటి వృత్తి నైపుణ్యాల్లో శిక్షణ అందించాలని జైలు అధికారు లకు సూచించారు. పరిశ్రమల్లో నైపుణ్యం కలిగిన కార్మికులకు ఉపాధి అవకాశాలు ఉన్నాయని, శిక్షణ పొందిన ఖైదీలు విడుదలైన తర్వాత స్వయంగా ఉపాధి పొందేందుకు, సమాజంలో గౌరవంగా జీవించేం దుకు ఇది దోహదపడుతుందని తెలిపారు. ఖైదీల సంక్షేమానికి సంబంధించి జైలు సూపరింటెండెంట్ చేసిన విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందిస్తూ, అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.జిల్లా ప్రధాన న్యాయమూర్తి అక్కిరెడ్డి నరసింహమూర్తి మాట్లా డుతూ మహాత్మా గాంధీజీ జయంతి సందర్భంగా నిర్వహి స్తున్న ఖైదీల సంక్షేమ దినోత్సవం అందరిలో మానవత్వం, పరివర్తన పట్ల అవగాహన పెంపొందించాలని అన్నారు. గాంధీజీ స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా సుమారు 2,000రోజుల పాటు జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు. జైళ్లు ప్రతీకారం తీర్చుకునే కేంద్రాలు కాకుండా, ఆసుపత్రిలో రోగికి చికిత్స అందించినట్లుగా వ్యక్తుల్లో మార్పు తీసుకొచ్చే సంస్కరణా కేంద్రాలుగా ఉండాలని గాంధీజీ భావించారని తెలిపారు."నేరాన్ని ద్వేషించండి.. నేరస్థుడిని ప్రేమించండి" అనే గాంధీజీ సందేశాన్ని గుర్తు చేస్తూ, ఖైదీలు గత తప్పులపై ఆత్మపరిశీలన చేసుకుని మంచి మార్గంలో పయనించాలని సూచించారు. జైలులో ఉంటూనే విద్యను అభ్యసించి టెన్త్, ఇంటర్, డిగ్రీ పూర్తి చేస్తున్న ఖైదీలను అభినందించారు. విడుదలైన తర్వాత స్వతంత్రంగా జీవించేందుకు వృత్తి నైపుణ్యాలను నేర్చుకో వాలని పిలుపు నిచ్చారు. జైలు అధికారులు ఖైదీలకు మార్గదర్శకులుగా వ్యవహరిస్తూ వారిని ఉత్తమ పౌరులు గా తీర్చిదిద్దాలని కోరారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నామని, న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు క్రమం తప్పకుండా కారాగారాన్ని సందర్శిస్తూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు.తొలుత జైలు సూపరింటెండెంట్ ఎం. వెంక టేశ్వర్లు ఖైదీల సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కారాగారానికి మున్సిపల్ నీటి సౌకర్యం, అదనపు అంబులెన్స్, ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో ఖైదీల కోసం ప్రత్యేకంగా పది పడకల వార్డు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పం దించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అనంతరం ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన ఖైదీలకు ధ్రువపత్రాలు అందజేశారు. సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను అభినందించి బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో ఏఎస్పి సౌజన్య,జైలు డిప్యూటీ సూపరి ంటెండెంట్లు కమలాకర్, మహేశ్వరుడు, న్యాయశాఖ అధికారులు, జైలు సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

# దళితులను ఇబ్బంది పెట్టాలని చూస్తే సహించేది లేదు

**బహుజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు మీజూర్ మాధవ్**




గూడూరు( సింధూరదర్శిని) 2 అక్టోబర్ నెల్లూరు జిల్లా; కాలం మారుతున్న ఎస్సీ,ఎస్టీల పైన దౌర్జన్యాలు మాత్రం ఆగడం లేదని,దళితులను ఇబ్బంది పెట్టాలని చూస్తే సహించేది లేదని బహుజన ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు మీజూరు మాధవ్ హెచ్చరించారు. చిల్లకూరు మండలంలోని ఉడతావారిపాలెం గ్రామంలో సర్వే నెంబర్ 221/1లో 9.17 సెంట్లు ప్రభుత్వ భూమిలో ఎన్నో ఏళ్లుగా ఎస్సీ, ఎస్టీలు ఇల్లు కట్టుకొని అదేవిధంగా 240-10 లో అన్ని వసతులతో స్మశానం ఏర్పరచుకొని జీవనం సాగిస్తున్నారు. భూమి రేట్లు పెరగడంతో కొందరు వ్యక్తులు దురుద్దేశంతో వారిని బెదిరింపులకు గురి చేస్తున్నారు. ఇదే విషయమై శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో వారిని ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ బాధ్యత గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు మీజూరు మాధవ్, బాధితులు జోగి చిరంజీవి, పుట్టయ్య,వెంకటేశ్వర్లు, వెంకటయ్య, నవ్య సాయి, మైత్రి, కోటమ్మ శ్యామలమ్మ రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

**తహసిల్దార్ గోపీనాథ్ రెడ్డి**

గూడూరు( సింధూరదర్శిని) 2అక్టోబర్ నెల్లూరు జిల్లా: చిల్లకూరు మండలం తహసీల్దార్ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల తహసీల్దార్ గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం గాంధీ సత్యం, అహింస సందేశాలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ,మండల సర్వేయర్,జూనియర్ అసిస్టెంట్- గ్రామ రెవెన్యూ అధికారులు వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు,కార్యాలయ సిబ్బంది ఈ సందర్భంగా గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.







# కల్కి భగవాన్ అంతిమయాత్రలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా మంత్రి ఆనం

## ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

## నివాళులర్పించిన దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

సత్యవేడు( సింధూర దర్శిని) 2 అక్టోబర్ తిరుపతి జిల్లా ; ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, వన్‌నెస్ స్పిరిచ్యువల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు కల్కి భగవాన్ (విజయ్ కుమార్ నాయుడు) అంతిమయాత్రలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాల్గొన్నారు. కల్కి భగవాన్ సెప్టెంబర్ 29న చెన్నైలో పరమపదించిన నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు పోలీస్ గౌరవ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించింది. వరదయ్యపాళెం మండలం, బత్తలవల్లం గ్రామంలోని ఏకం క్షేత్రంలో శుక్రవారం సాయంత్రం అంతిమ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కల్కి భగవాన్ పార్థివదేహానికి నివాళులర్పించి, అంతిమయాత్రలో పాల్గొని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆధ్యాత్మిక రంగంలో కల్కి భగవాన్ అందించిన సేవలను మంత్రి స్మరించుకున్నారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.





# 50ఏళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం

## పొట్టేపాలెం కలుజుపై వంతెన ప్రారంభం

## నెల్లూరు రూరల్ అభివృద్ధికి జిల్లా కలెక్టర్ సహకారం మరువలేనిది

## ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి

## అట్టహాసంగా పొట్టేపాలెం వంతెనపై బ్రిడ్జి ప్రారంభోత్సవం

నెల్లూరు (సింధూర దర్శిని) 2 అక్టోబర్ నెల్లూరు జిల్లా ; నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని పొట్టేపాళెం గ్రామంలో రూ.6.54 కోట్ల వ్యయంతో నిర్మించిన కలుజుపై వంతెనను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, పొట్టేపాళెం కలుజుపై వంతెన నిర్మాణం ఈ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమని, గత 50 ఏళ్లుగా ఎదురవుతున్న సమస్యకు ఈ వంతెనతో శాశ్వత పరిష్కారం లభించిందని తెలిపారు. వంతెన కోసం ప్రజలు తనను ప్రశ్నించారని, వారి ప్రశ్నల్లో న్యాయం ఉందని పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తానని స్పష్టం చేశారు.నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేపట్టడం సంతృప్తినిస్తోందని, ఇప్పటివరకు చేపట్టిన, కొనసాగుతున్న, టెండర్లు పిలిచిన పనుల విలువ మొత్తం రూ.966 కోట్లు అని తెలిపారు. ఈ అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, జిల్లా మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్రలకు కృతజ్ఞతలు తెలిపారు. నెల్లూరు రూరల్ అభివృద్ధికి సహకరించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ, ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా చూశానని తెలిపారు. పొట్టేపాళెం వంతెన నెల్లూరు జిల్లా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఏడాదిలో పూర్తి చేస్తామని చెప్పిన పనిని 11 నెలల్లోనే పూర్తి చేయడంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కృషి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# టిడిపి ప్రభుత్వంలోనే అభివృద్ధి పనులు

## ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ - పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు గుర్తించుకోవాలి



గూడూరు (సింధూర దర్శిని) 2 అక్టోబర్ నెల్లూరు జిల్లా ; పంచాయతీరాజ్ శాఖ ద్వారా గూడూరు నియోజకవర్గానికి 10 కోట్ల రూపాయల నిధులు మంజూరు అయ్యాయని ఈ నిధులతో సిసి రోడ్లు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని టిడిపి ప్రభుత్వం లోనే అభివృద్ధి పనులు జరిగాయని పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు. చిల్లకూరు బైపాస్ సర్కిల్ వద్ద పంచాయతీరాజ్ శాఖ నిధులతో రెండు కోట్ల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ శంకుస్థాపన చేశారు. స్థానిక నాయకులు ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే పూజా కార్యక్రమాలు నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గానికి 10 కోట్ల రూపాయల నిధులు విడుదల చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు నియోజకవర్గం ప్రజలు తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. టిడిపి ప్రభుత్వంలోనే గతంలో పోటు పాలెం గ్రామంలో బ్రిడ్జి నిర్మించామని గత వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని గుర్తు చేశారు. నాయకులు కష్టపడి పనిచేసే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కిరణ్ కుమార్, బిల్లు చెంచురామయ్య, టిడిపి రాష్ట్ర కార్యదర్శి, కందుకూరు నియోజక వర్గ పరిశీలకులు మట్టం శ్రావణి రెడ్డి, వాటంబేడు హరికుమార్, రహీం, తదితరులు పాల్గొన్నారు.



# చంద్రబాబుతోనే అభివృద్ధి సంక్షేమం

## ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ - రూ.20లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



గూడూరు(సింధూర దర్శిని) 2 అక్టోబర్ నెల్లూరు జిల్లా ; సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిల్లకూరు మండల పరిధిలోని బుధనం పంచాయతీలోని పత్రగుంట గ్రామం నందు శుక్రవారం పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా 20 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. టిడిపి హాయంలోనే అభివృద్ధి సంక్షేమం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆడిటర్ సురానేని రామచంద్ర రావు, గుండాల లీలావతి, చిరంజీవి, పెనుబోలు జానకిరామ్‌రెడ్డి, కిరణ్ కుమార్, మేకల కుమార్, అబ్దుల్ రహీం, దిలీప్‌రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గాంధీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు సహకరించాలి : ఆర్డీవో అరుణకుమారి



గూడూరు (సింధూరదర్శిని) 2 అక్టోబర్ నెల్లూరు జిల్లా; జాతిపిత మహాత్మాగాంధీ అహింస ద్వారా స్వాతంత్రం కోసం పోరాడారని ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు సహకరించాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గూడూరు ఆర్డీవో అరుణకుమారి సూచించారు. గూడూరు పట్టణంలోని డి ఆర్ డబ్ల్యు మహిళాకళాశాలలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో గాంధీజయంతి సందర్భంగా స్వచ్ఛతహి సేవ అవగాహన సమావేశం నిర్వహించారు అతిథిగా ఆర్డీవో అరుణకుమారి విచ్చేశారు. ఆర్డిఓ మరియు నాయకులు గాంధీజీ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆర్డీవో అరుణకుమారి మాట్లాడుతూ మహాత్మా గాంధీ దేశ స్వాతంత్రం కోసం ఎన్నో పోరాటాలు చేశారని ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేశారని తెలిపారు. గాంధీజీ జయంతి సందర్భంగా స్వచ్ఛతహి సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే అనారోగ్య సమస్యలు రావని ప్రతి ఒక్కరు పరిశుభ్రతకు సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునరావు నాయకులు కిరణ్ కుమార్, బిల్లు చెంచురామయ్య, మట్టం శ్రావణి, రహీం, చంద్రమౌళి, హనుమంతరావు ,పురపాలక సంఘ సిబ్బంది ,కళాశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# గుండె చికిత్సకు రూ.1.81లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం

### కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రత్యేక చొరవ



నెల్లూరు (సింధూరదర్శిని) 2 అక్టోబర్ నెల్లూరు జిల్లా ; ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. కోడవలూరు గ్రామం, మండలానికి చెందిన సయ్యద్ నవీద్ అహ్మద్ (11 సంవత్సరాలు) గుండె చికిత్స కోసం హైదరాబాద్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌కు రూ.1,81,126 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్‌ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరైంది.

హైదరాబాద్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో చికిత్స అవసరం కాగా, వైద్య ఖర్చులు భారీగా కానుండటంతో అంత మొత్తం భరించే స్థోమత లేక కుటుంబ సభ్యులు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని ఆశ్రయించారు. కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే తక్షణమే స్పందించి, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి కార్యాలయానికి సిఫార్సు చేశారు. ఎమ్మెల్యే చొరవతో సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి కార్యాలయం, సయ్యద్ నవీద్ అహ్మద్ చికిత్స కోసం రూ.1,81,126 విలువైన సీఎంఆర్ఎఫ్ లెటర్ ఆఫ్ క్రెడిట్ ను మంజూరు చేసింది. శుక్రవారం వీపీఆర్ కార్యాలయంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తరఫున కోడవలూరు తెలుగుదేశం పార్టీ నాయకులు బాసే బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీని అందజేశారు. సకాలంలో ఆర్థిక సాయం అందేలా ప్రత్యేక చొరవ తీసుకున్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# మహనీయులను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలి

### ఆంధ్ర మహిళా మండలి గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ రోహిణి



గూడూరు( సింధూర దర్శిని) 2 అక్టోబర్ నెల్లూరు జిల్లా ; దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన మహనీయులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని గూడూరు ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి వెల్లడించారు. గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో గాంధీ జయంతి సందర్భంగా ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులు గాంధీ చిత్రపటానికి పూలమాలయ నివాళులర్పించారు. రోగులకు పండ్లు రొట్టెలను పంపిణీ చేశారు. ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా జీవించేందుకు ఎందరో మహనీయులు ప్రాణాలర్పించి స్వాతంత్రాన్ని తీసుకొచ్చారని వారిని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రతి సంవత్సరం గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో కలిసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మల, సుప్రియ,జీవని, సుప్రజ ,సాయి సుమతి ,హాస్పిటల్ సూపర్డెంట్ షరీనా సిబ్బంది పాల్గొన్నారు.

# గాంధీజీ ఆశయాల స్ఫూర్తితో ప్రజలకు అంకితభావంతో సేవలందించాలి

### జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు

### కలెక్టరేట్‌లో ఘనంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు

నెల్లూరు (సింధూర దర్శిని) 2 అక్టోబర్ నెల్లూరు జిల్లా ; మహాత్మా గాంధీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రభుత్వ ఉద్యోగులు నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు అంకితభావంతో సేవలందించాలని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్లు మొగిలి వెంకటేశ్వర్లు,




డీఆర్ఓ విజయ్ కుమార్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి వేణుగోపాల్ తది తరులు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, సత్యం, అహింస, శాంతి, సేవ వంటి గాంధీజీ ఆదర్శాలు నేటికీ సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. గాంధీజీ చూపిన మార్గంలో పయనిస్తూ విధుల నిర్వహణలో నిజాయితీ, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన ప్రవర్తనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరిస్తూ, ప్రభుత్వ సేవలను అర్హులైన ప్రతి ఒక్కరికీ సమర్థవంతంగా అందించేందుకు ఉద్యోగులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# చిత్తూరులో 'స్వచ్ఛ్ ఆంధ్ర అవార్డ్స్ 2026' ప్రధానోత్సవం

చిత్తూరు (సింధూర దర్శిని)2 అక్టోబర్ చిత్తూరు జిల్లా ; మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని జిల్లా పరిషత్ (జెడ్పీ) సమావేశ మందిరంలో 'స్వచ్ఛ్ ఆంధ్ర అవార్డ్స్ 2026' ప్రధానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథుగా చిత్తూరు పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) దగ్గుమళ్ళ ప్రసాద రావు, చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ విచ్చేశారు. ఈ సందర్భంగా సమాజ పరిభ్రమణంలో, పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న పలువురు స్వచ్ఛ ఆంధ్ర సేవకులను ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద రావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఘనంగా సత్కరించి, వారికి 'స్వచ్ఛ్ ఆంధ్ర అవార్డులను' ప్రధానం చేశారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. పూజ్య బాపూజీ కలలుగన్న స్వచ్ఛ భారత సాధనలో స్వచ్ఛ ఆంధ్ర సేవకుల పాత్ర ఎనలేనిదని కొనియాడారు. సమాజాన్ని స్వచ్ఛంగా, ఆరోగ్యంగా ఉంచడంలో వారు అందిస్తున్న నిరంతర సేవలు ఎంతో అభినందనీయమని ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ గాంధీజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని పరిసరాల



పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని వారు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, స్వచ్ఛ ఆంధ్ర సిబ్బంది మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెళ్లి పేరుతో మోసం... బెదిరింపులకు పాల్పడిన నిందితుడి అరెస్టు

తిరుపతి( సింధూరదర్శని)2 అక్టోబర్ తిరుపతి జిల్లా; జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు బాధితురాలి ఫిర్యాదుపై అలిపిరి పోలీసులు వెంటనే స్పందించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేసి, అనంతరం వ్యక్తిగత ఫొటోలు, వీడియోలతో బెదిరింపులకు పాల్పడ్డాడని బాధితురాలు ఫిర్యాదు చేశారు. జార్జియాలో ఎంబీబీఎస్ చదువుతున్న సమయంలో నిందితుడి తో పరిచయం ఏర్పడినట్లు, వివాహం చేసుకుంటానని నమ్మించి శారీరక సంబంధం కొనసాగించినట్లు, అనంతరం తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్‌కు పిలిపించి కలిసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వివాహం విషయమై ప్రశ్నించగా తన మతంలోకి మారాలని ఒత్తిడి చేసి, అంగీకరించకపోతే వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తానని, బంధువులకు పంపుతానని బెదిరించినట్లు తెలిపారు. ఈ మేరకు బి ఎన్ ఎస్ సెక్షన్లు 69, 351(2) కింద కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో అలిపిరి పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని హైదరాబాద్‌కు పంపించారు. నిందితుడి ఆచూకీ గుర్తించి 01-10-2026 ఉదయం 10:30 గంటలకు మలక్‌పేట్, అక్బర్ బాగ్‌లోని అతని నివాసం వద్ద అరెస్టు చేశారు. నిందితుడు: మొహమ్మద్ రయీద్ ఖాద్రీ ఏ రయీద్ మొహమ్మద్ ఖాదర్, 24 సంవత్సరాలు, హైదరాబాద్. అనంతరం నిందితుడిని తిరుపతికి తీసుకువచ్చి విచారణ చేపట్టి, కీలక సాంకేతిక ఆధారాలు ఉన్నట్లు భావిస్తున్న Samsung Galaxy S24 Ultra మొబైల్ ఫోన్‌ను పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు.



సాంకేతిక ఆధారాలను పరిశీలిస్తూ తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

నిందితుడిని రిమాండ్ నిమిత్తం న్యాయస్థానం ముందు హాజరుపరుస్తున్నారు. విదేశాలు లేదా ఇతర రాష్ట్రాల్లో చదువుకునే విద్యార్థులు సోషల్ మీడియా పరిచయాలను గుడ్డిగా నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు, సున్నితమైన సమాచారాన్ని ఇతరులతో పంచుకోకూడదని పోలీసులు సూచించారు. తమ నివాసం, స్నేహితులు, ఎదురయ్యే సమస్యలను తల్లిదండ్రులతో ఎప్పటికప్పుడు పంచుకోవాలని తెలిపారు. వివాహం పేరుతో మోసం, వేధింపులు, బ్లాక్‌మెయిలింగ్ లేదా వ్యక్తిగత ఫొటోలు, వీడియోలతో బెదిరింపులు ఎదురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

అత్యవసర సహాయం కోసం డయల్ 112, సైబర్ నేరాల కోసం 1930 లేదా cybercrime.gov.inను సంప్రదించవచ్చని, విదేశాల్లో ఉన్న విద్యార్థులు అవసరమైనప్పుడు సంబంధిత భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. మహిళల భద్రతకు తిరుపతి జిల్లా పోలీస్ శాఖ అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, మహిళలపై వేధింపులు, బెదిరింపులు లేదా ఇతర చట్టవిరుద్ధ చర్యలపై ఫిర్యాదులు అందిన వెంటనే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ముఖ్యమంత్రి నుంచి ప్రతిష్టాత్మక స్వచ్ఛ అవార్డు అందుకున్న కమిషనర్

### స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ - 2026..నెల్లూరు కార్పొరేషన్‌కు 4 ప్రతిష్టాత్మక అవార్డుల ఘనత

### రాష్ట్రస్థాయిలో మెరిసిన నెల్లూరు..స్వచ్ఛ ఆంధ్రలో అవార్డుల పంట

### పారిశుద్ధ్య సిబ్బంది, ప్రజల కృషికి దక్కిన గుర్తింపు: నెల్లూరు కమిషనర్ వై.ఓ. నందన్




విజయవాడ సింధూర దర్శిని: పరిశుభ్రత, పచ్చదనం మరియు పర్యావరణ పరిరక్షణలో నెల్లూరు నగరం రాష్ట్రస్థాయిలో సరికొత్త రికార్డు సృష్టించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ - 2026 ఫలితాల్లో నెల్లూరు నగరపాలక సంస్థ మూడు సాధారణ అవార్డులతో పాటు వాయు నాణ్యత పరిరక్షణ విభాగంలో నగదు బహుమతితో కూడిన ప్రత్యేక అవార్డును కైవసం చేసుకుంది. స్వచ్ఛ అవార్డులను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా శుక్రవారం విజయవాడలోని కన్వెన్షన్ సెంటర్లో కమిషనర్ వై.ఓ నందన్, ఇతర అధికారులు అందుకున్నారు. స్వచ్ఛ అవార్డుల ప్రధానోత్సవం లో మున్సిపల్ శాఖ మంత్రివర్యులు డాక్టర్ పి నారాయణ, స్వచ్ఛంద కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, ఇతర అధికారులు హాజరయ్యారు. స్వచ్ఛ పాఠశాలల విభాగంలో దేవిరెడ్డి శారద హైస్కూల్ ( నరేంద్ర, ), స్వచ్ఛ పార్కుల విభాగంలో చిల్డ్రన్స్ పార్క్ (సురేష్, ), కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంలో ఎమ్.జి.బి ఫెలిసిటీ మాల్ (అస్రిత, ఇన్‌చార్జ్) అవార్డులు సాధించగా, వాయు సర్వేక్షణ ప్రత్యేక అవార్డును కమిషనర్ వై.ఓ. నందన్ అందుకున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది, అధికారుల సమన్వయం మరియు ప్రజల భాగస్వామ్యంతోనే ఈ ఘనత సాధ్యమైందని, రాబోయే రోజుల్లో "స్వచ్ఛమైన నెల్లూరు -- ఆరోగ్యకరమైన నెల్లూరు" లక్ష్యంతో నగర రూపురేఖలను మరిన్ని పర్యావరణహిత మార్పులతో తీర్చిదిద్దుతామని కమిషనర్ హర్షం వ్యక్తం చేశారు.

# కామదేను వాహనంపై దేవాది దేవుడు విఘ్నేశ్వరుడు

కాణిపాకం (సింధూర దర్శిని) 2 అక్టోబర్ చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి కామధేనువాహనం సేవ పై దర్శనం ఇచ్చిన దేవాది దేవుడు పార్వతీ తనయుడు విఘ్నేశ్వరుడు, ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, ఆలయ ఈవో పెంచల కిషోర్ మరియు ఈ.ఓ, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు, ఉభయదారులు, ఆలయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## కండక్టర్‌గా సీఎం విజయ్..

బస్సులో మహిళలకు స్వయంగా టికెట్ల పంపిణీ

తమిళనాడులో మహిళల ఉచిత బస్సు పథకం 'వెట్రి పయనం' విస్తరణ

గాంధీ జయంతి సందర్భంగా పథకాన్ని ప్రారంభించిన సీఎం విజయ్

ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులకు కూడా వర్తించనున్న ఉచిత ప్రయాణం

ఈ పథకంతో రోజుకు 84 లక్షల మంది మహిళలకు ప్రయోజనం

మహిళలతో పాటు ట్రాన్స్‌జెండర్లకు కూడా ఈ పథకం వర్తింపు



తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని మరింత విస్తరించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని నేడు 'వెట్రి పయనం' పేరుతో ఈ విస్తృత పథకాన్ని ఆయన ప్రారంభించారు. చెన్నైలోని కోయంబేడు బస్ టెర్మినస్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం స్వయంగా మహిళా ప్రయాణికులకు ఉచిత టికెట్లు అందజేసి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఇప్పటివరకు సాధారణ సిటీ, టౌన్ బస్సులకే పరిమితమైన ఈ పథకాన్ని ఇప్పుడు మరిన్ని సర్వీసులకు వర్తింపజేశారు. దీని ప్రకారం, ఇకపై మెట్రోపాలిటన్, పట్టణ ప్రాంతాల్లో నడిచే ఎక్స్‌ప్రెస్, లిమిటెడ్ స్టాప్ సర్వీస్ (ఎల్ఎస్ఎస్), డీలక్స్ బస్సుల్లో కూడా మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. అలాగే 40 కిలోమీటర్లు దాటిన మొఫుసిల్ ఆర్డినరీ, కొండ ప్రాంతాల్లోని ఆర్డినరీ బస్సులకు కూడా ఈ పథకం వర్తిస్తుంది. ఈ విస్తరణతో రాష్ట్రంలోని ఏడు ప్రభుత్వ రవాణా సంస్థలకు చెందిన మొత్తం 12,692 బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఇది మొత్తం బస్సుల్లో సుమారు 69 శాతం. ఈ పథకం ద్వారా ప్రతిరోజూ సుమారు 84.32 లక్షల మంది మహిళలు లబ్ధి పొందుతారని అంచనా వేస్తున్నారు. ఉద్యోగాలు, కళాశాలలు, ఇతర పనుల కోసం ప్రయాణించే మహిళల ఖర్చులను తగ్గించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. దీనికి ఎలాంటి ఆదాయ పరిమితి గానీ, ప్రయాణాలపై పరిమితి గానీ లేదు. మహిళలతో పాటు ట్రాన్స్‌జెండర్లకు కూడా ఈ సౌకర్యం వర్తిస్తుంది. అయితే, 'స్టేట్ ఎక్స్‌ప్రెస్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్' (ఎస్ఈటీసీ) బస్సులకు ఈ పథకం నుంచి మినహాయింపు ఇచ్చారు.

## గాంధీకి వ్యతిరేకంగా ఉన్న గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి: భట్టి విక్రమార్క



హైదరాబాద్ సింధూరదర్శిని: గాంధీ జయంతిని పురస్కరించుకుని జాతిపిత మహాత్మా గాంధీకి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘన నివాళు లర్పించారు. గాంధీజీ ఆశయాల స్ఫూర్తితోనే రాష్ట్రం లోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, వివక్ష లేని సమాజ నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గాడ్సే భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ, స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను వక్రీకరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ ఐక్యంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. సత్యం, అహింస, శాంతి మార్గాల ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేలా చేసిన గాంధీజీ ఆశయాలు సదా స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గాంధీజీ చూపిన మార్గంలోనే తమ ప్రభుత్వం పయనిస్తోందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా విద్యార్థులందరికీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించాలనే ఉద్దేశంతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల'ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వివక్షకు తావులేని సమసమాజ నిర్మాణమే ప్రజా పాలన అంతిమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

# భోజనం తర్వాత 5, 10, 20 నిమిషాల నడక.. షుగర్ తగ్గాలంటే ఎంతసేపు నడవాలి?

కదలిక లేకపోవడం కంటే 5 నిమిషాల నడక కూడా మేలంటున్న నిపుణులు

10 నిమిషాల నడక సులభంగా అలవాటు చేసుకునే అవకాశం

20 నిమిషాల నడకతో మరింత శారీరక కదలిక - తరచూ చిన్న నడకలు షుగర్‌పై మంచి ప్రభావం చూపొచ్చని వెల్లడి

ప్రతి 15-20 నిమిషాలకు కదలడం ప్రయోజనకరమంటున్న స్టడీస్



భోజనం చేశాక వెంటనే కుర్చీలో కూర్చుంటున్నారా? అయితే ఇకపై ఆ అలవాటును కాస్త మార్చుకోవాల్సిందే. తిన్న తర్వాత కొద్దిసేపు నడవడం వల్ల కండరాలు రక్తంలోని గ్లూకోజ్‌ను శక్తిగా ఉపయోగించుకుంటాయి. దీంతో భోజనం తర్వాత రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరగకుండా కొంతవరకు అడ్డుకోవచ్చు. అయితే 5 నిమిషాలు నడిస్తే సరిపోతుందా? 10 నిమిషాలా? 20 నిమిషాలు నడవాలా? దీనిపై తాజా పరిశోధనలు ఆసక్తికరమైన విషయాలను చెబుతున్నాయి.

**5 నిమిషాల నడక**

సమయం తక్కువగా ఉన్నా 5 నిమిషాలు నడవడం వృథా కాదు. తిన్న తర్వాత కాసేపు కదలడం వల్ల కండరాలు గ్లూకోజ్‌ను ఉపయోగించుకునే ప్రక్రియ మొదలవుతుంది. అయితే కేవలం 5 నిమిషాల నడకే షుగర్‌ను తగ్గించేందుకు సరైన సమయం అని చెప్పడానికి ఆధారాలు పరిమితంగా ఉన్నాయి. ముఖ్యంగా భోజనం తర్వాత నడిచే అలవాటును క్రమం తప్పకుండా కొనసాగించడం ముఖ్యం.

**10 నిమిషాలు నడిస్తే..**

బిజీగా ఉండేవారికి 10 నిమిషాల నడక సులభంగా అలవాటు చేసుకునే మార్గం. భోజనం తర్వాత కొద్దిసేపు చురుగ్గా నడవడం వల్ల కండరాలు మరికొంతసేపు పనిచేస్తాయి. ముఖ్యంగా కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉన్న భోజనం తర్వాత ఇది ఉపయోగపడొచ్చు. అమెరికన్ డయాబెటిస్ అసోసియేషన్ కూడా భోజనం తర్వాత చిన్నపాటి శారీరక కదలికలను ప్రోత్సహిస్తోంది.

**20 నిమిషాలు నడిస్తే..**

20 నిమిషాలు నడిస్తే శారీరక కదలిక మరింత పెరుగుతుంది. అయితే ఒక్కసారిగా 20 నిమిషాలు నడవడం తప్పనిసరి కాదు. 2026లో ప్రచురితమైన 53 అధ్యయనాల సమీక్షలో ఎక్కువసేపు కూర్చోవడాన్ని తరచూ చిన్న నడకలతో మధ్యలో విరమించడం వల్ల భోజనం తర్వాత గ్లూకోజ్, ఇన్సులిన్ స్థాయిలపై మంచి ప్రభావం కనిపించింది. ముఖ్యంగా ప్రతి 15 నుంచి 20 నిమిషాలకు కదలడం వల్ల తగ్గుదల ఎక్కువగా కనిపించింది.

**మరి ఎంతసేపు నడవాలి?**

5, 10, 20 నిమిషాల్లో ఒక్కదానినే అందరికీ సరైన సమయంగా చెప్పలేం. 5 నిమిషాలు కూడా కదలకుండా ఉండటం కంటే మేలు. 10 నిమిషాలు నడవడం సులభమైన లక్ష్యం. 20 నిమిషాలు నడవగలిగితే మరింత శారీరక కదలిక లభిస్తుంది. ముఖ్యంగా ఎక్కువసేపు కూర్చోకుండా మధ్య మధ్యలో లేచి కదలడం ముఖ్యం. డయాబెటిస్ ఉన్నవాళ్లు కనీసం ప్రతి 30 నిమిషాలకు ఒకసారి లేచి అటూఇటూ తిరగాలని 2026 మార్గదర్శకాల్లో అమెరికన్ డయాబెటిస్ అసోసియేషన్ సూచించింది.

అందుకే '20 నిమిషాలే నడవాలి' అని ఒత్తిడి పడాల్సిన అవసరం లేదు. భోజనం తర్వాత 5 లేదా 10 నిమిషాలతో మొదలుపెట్టి క్రమంగా అలవాటు చేసుకోవచ్చు. ఒకేసారి ఎక్కువసేపు కూర్చోవడం కంటే తరచూ చిన్నపాటి నడకలు కూడా ఉపయోగపడతాయి.

# నెరవేరని టెస్ట్ కల.. రెడ్ బాల్ క్రికెట్‌కు చాహల్ గుడ్‌బై!

ఫస్ట్ క్లాస్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన భారత లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ - టెస్ట్ క్యాప్ ధరించాలన్న తన కల ఇక నెరవేరదని భావోద్వేగం

పరిమిత ఓవర్ల క్రికెట్లో మాత్రం తన ప్రస్థానం కొనసాగుతుందని స్పష్టీకరణ - దేశం తరఫున ఆడాలన్న ఆకలి ఇంకా ఉందని వెల్లడి

17 ఏళ్ల కెరీర్‌లో 49 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన చాహల్




భారత సీనియర్ లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ తన క్రికెట్ కెరీర్‌కు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్ నుంచి వైదొలగుతున్నట్లు అధికారికంగా ప్రకటించాడు. భారత్ తరఫున టెస్ట్ క్యాప్ ధరించాలన్న తన చిరకాల స్వప్నం ఇక నెరవేరే అవకాశం లేదని గ్రహించిన తర్వాతే ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిపాడు. అయితే, వన్డే, టీ20 ఫార్మాట్లలో తన ప్రస్థానం కొనసాగుతుందని స్పష్టం చేశాడు. 17 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించినా, టెస్టుల్లో ఆడే అవకాశం మాత్రం చాహల్‌కు దక్కలేదు.

ఈ సందర్భంగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో చాహల్ ఒక భావోద్వేగ పోస్ట్ చేశాడు. "నేను మొదటిసారి పట్టుకున్నది రెడ్ బాల్. అప్పుడు నా వయసు 10 ఏళ్లు. ఈ ఆటతో ఇంత ప్రేమలో పడతానని అప్పుడు నాకు తెలియదు. రెడ్ బాల్ క్రికెట్ నాకు కేవలం ఒక ఫార్మాట్ మాత్రమే కాదు. ఓపిక, పట్టుదల, దృఢ సంకల్పం అంటే ఏమిటో అక్కడే నేర్చుకున్నా. ప్రతి వికెట్, ప్రతి పరుగు కోసం గంటల తరబడి పోరాడటంలోని ఆనందాన్ని అనుభవించాను" అని పేర్కొన్నాడు. "నా చివరి ఫస్ట్ క్లాస్ మ్యాచ్ లార్డ్స్‌లో ఆడాను. టెస్ట్ క్యాప్ ధరించడం నా కల. ఎన్నో ఏళ్లుగా ఆ కలను మోశాను. అది నెరవేరకపోయినా, ఈ ఫార్మాట్‌లో నాకు లభించిన ప్రతి అవకాశానికి నేను కృతజ్ఞుడిని. రెడ్ బాల్ క్రికెట్ నా జీవితంలో కొన్ని మధురమైన జ్ఞాపకాలను ఇచ్చింది" అని చాహల్ తెలిపాడు. అదే సమయంలో పరిమిత ఓవర్ల క్రికెట్ నుంచి తాను తప్పుకోవడం లేదని చాహల్ స్పష్టం చేశాడు. "నా దేశం కోసం ఆడాలనే ఆకలి నాలో ఇంకా సజీవంగా ఉంది. వన్డే, టీ20 ఫార్మాట్లలో మరో అవకాశం సంపాదించడానికి నా సర్వశక్తులు ఒడ్డుతాను" అని పేర్కొన్నాడు. తన ప్రయాణంలో అండగా నిలిచిన హర్యానా క్రికెట్ అసోసియేషన్‌కు, రణ్‌బీర్ సింగ్ మహీంద్రా, అనిరుధ్ సింగ్ చౌదరీలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు.

**చాహల్ ఫస్ట్ క్లాస్ క్రికెట్ కెరీర్ ఇలా..**

2009లో హర్యానా తరఫున ఫస్ట్ క్లాస్ అరంగేట్రం చేసిన చాహల్, తన కెరీర్‌లో మొత్తం 49 మ్యాచ్‌లు ఆడి 32.27 సగటుతో 148 వికెట్లు పడగొట్టాడు. 2016-17 రంజీ సీజన్‌లో 7 మ్యాచ్‌లలో 33 వికెట్లతో అద్భుతంగా రాణించాడు. ఇటీవల 2026 కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో నార్తాంప్టన్‌షైర్ తరఫున ఆడి 16.14 సగటుతో 21 వికెట్లు తీశాడు. ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా రికార్డు సృష్టించిన చాహల్, 2023-24 విజయ్ హజారే ట్రోఫీలో హర్యానా విజయంలో 18 వికెట్లతో కీలకపాత్ర పోషించాడు.

# ఓటర్ల జాబితాలో పేరు లేదా? మళ్లీ అవకాశం.. ప్రత్యేక డ్రైవ్‌కు ఈసీ ఆదేశం

ప్రత్యేక ఓటరు నమోదు డ్రైవ్‌కు ఈసీ ఆదేశం

ఇంటింటికీ వెళ్లనున్న బూత్ స్థాయి అధికారులు

ఫారం-6 ద్వారా అర్హులకు నమోదు అవకాశం

తొలిసారి ఓటర్లపై ప్రత్యేకంగా దృష్టి - నెల రోజుల్లో డ్రైవ్ పూర్తి చేయాలని సూచన

ఓటర్ల జాబితా నుంచి పేరు గల్లంతైన వారికి మరో అవకాశం కల్పించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) పూర్తయిన ప్రాంతాల్లో ఈ డ్రైవ్ నిర్వహించాలని సూచించింది. జాబితాలో చోటు దక్కని వారితో పాటు తొలిసారి ఓటు వేయబోయే యువతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని స్పష్టం చేసింది.

**ఇళ్లకు వెళ్లి వివరాల సేకరణ**

'సర్' సందర్భంగా ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో గైర్హాజరు, వేరే ప్రాంతానికి వెళ్లిపోయిన, మరణించిన, ఒకటికి మించి నమోదైన ఓటర్ల వివరాలను బూత్‌స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) సేకరించారు. ఇప్పుడు పాత ఓటర్ల జాబితాతో ప్రస్తుత జాబితాను పోల్చి.. గతంలో పేరు ఉండి ప్రస్తుతం కనిపించని వారి జాబితాను సిద్ధం చేయాలని ఈసీ సూచించింది.

ఆ తర్వాత బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఆయా వ్యక్తుల ప్రస్తుత పరిస్థితిని తెలుసుకోవాలి. వారు అర్హులైతే ఫారం-6 ద్వారా మళ్లీ ఓటరుగా నమోదు చేసేందుకు సహకరించాలి. ప్రతి వారం కనీసం 20 నుంచి 25 మంది ఓటర్లను కలిసేలా కార్యక్రమాన్ని రూపొందించాలని ఈసీ ఆదేశించింది. దాదాపు నెల రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించింది.

**యువతపైనా ప్రత్యేక దృష్టి**




ఇంటింటి పరిశీలన సందర్భంగా జాబితాలో చేరని అర్హులు, తొలిసారి ఓటు హక్కు పొందుతున్న యువతను కూడా గుర్తించాలని ఈసీ తెలిపింది. కార్మికుల నివాస ప్రాంతాలు, నిరాశ్రయులు, అణగారిన వర్గాల కోసం ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహించాలని సూచించింది.

బీఎల్‌ఓలు సేకరించిన వివరాలు, ఫారం-6 దరఖాస్తులు, క్షేత్రస్థాయి పరిశీలన నివేదికలను సంబంధిత ఎన్నికల నమోదు అధికారులకు (ఈఆర్‌ఓలు) అందించాలి. వాటిని పరిశీలించి చట్ట ప్రకారం నిర్ణయం తీసుకుంటారు. ఈ జాబితాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ స్థాయి ప్రతినిధులతోనూ పంచుకోవాలని ఈసీ ఆదేశించింది.

**విస్తృత అవగాహన కార్యక్రమాలు**

ఓటరు నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విద్యాసంస్థలు, స్థానిక కార్యక్రమాలు, SVEEP కార్యక్రమాలు, మీడియా సమావేశాలను విస్తృతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్‌ఓలకు సూచించింది. ప్రత్యేక డ్రైవ్ పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించింది. ఓటర్ల నమోదును నిరంతర ప్రక్రియగా పేర్కొన్న ఈసీ.. అర్హత ఉన్న ఎవరైనా ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకునే అవకాశం ఉందని స్పష్టం చేసింది.

# ప్రపంచకప్‌కు ఏడాది ముందే ఆ పని చేయాలి.. యువరాజ్ కీలక సూచన

2027 ప్రపంచకప్‌పై యువరాజ్ మాస్టర్ ప్లాన్ - ఏడాది ముందే కోర్ జట్టు ఎంపిక చేయాలన్న మాజీ స్టార్

16 నుంచి 20 మంది ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలని సూచన - ఆటగాళ్లకు ప్రతి స్థానంలో అనుభవం అవసరమని వ్యాఖ్య

టోర్నీకి నెల ముందే దక్షిణాఫ్రికాలో సాధన చేయాలని సూచన - భారత్ అన్ని విభాగాల్లో బలంగా ఉందన్న రైనా



2027 వన్డే ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలిచే సత్తా ఉందని మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ అభిప్రాయ పడ్డాడు. అయితే, టోర్నీకి ఏడాది ముందే 16 నుంచి 20 మంది ఆటగాళ్లతో కూడిన కోర్ టీమ్ ను సిద్ధం చేయాలని సూచించాడు. పదేపదే ఆటగాళ్లను మార్చకుండా, ప్రతి ఒక్కరికీ తగినన్ని మ్యాచ్‌లు ఆడే అవకాశం కల్పించాలని టీమ్ మేనేజ్‌మెంట్‌కు తెలిపాడు. "ప్రపంచకప్‌నకు ఏడాది ముందే జట్టును సిద్ధం చేయాలి. టాప్ ఆర్డర్, మిడిల్ ఆర్డర్‌లో నాలుగు, ఐదు, ఆరు స్థానాల్లో ఆడేవారికి తగినంత మ్యాచ్ అనుభవం ఉండాలి. ప్రపంచకప్ గెలవాలనే ఆలోచనతో ఆటగాళ్లపై ఒత్తిడి పెంచకూడదు. ఎంపిక చేసిన 16 నుంచి 20 మంది ఆటగాళ్లు ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఆడేందుకు సిద్ధంగా ఉండాలి. టోర్నీకి నెల రోజుల ముందే దక్షిణాఫ్రికా చేరుకుని సాధన చేయాలి" అని 2011 ప్రపంచకప్ హీరో యువరాజ్ జియోస్టార్‌తో చెప్పాడు. 2027 అక్టోబర్ 7 నుంచి దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా ప్రపంచకప్ జరగనుంది. టోర్నీ షెడ్యూల్‌ను గురువారం కేప్‌టౌన్‌లో ప్రకటించారు. భారత్ తన తొలి మ్యాచ్‌లో అక్టోబర్ 7న ఆస్ట్రేలియాతో తలపడనుంది. అక్టోబర్ 10న జోహన్నెస్ బర్గ్‌లో పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడనుంది. ఆఫ్ఘనిస్థాన్, క్వాలిఫయర్-ఏ జట్టు, ఆతిథ్య జట్టు జింబాబ్వేతోనూ భారత్ పోటీపడుతుంది. నవంబర్ 21న జోహన్నెస్‌బర్గ్ లో ఫైనల్ జరగనుంది. మరోవైపు, 2011 ప్రపంచకప్ విజేత జట్టులో సభ్యుడైన సురేశ్ రైనా.. ప్రస్తుతం అన్ని విభాగాల్లోనూ పాకిస్థాన్ కంటే భారత్ ముందుందని అభిప్రాయపడ్డాడు. ఆటగాళ్లలో పెరిగిన ఆత్మవిశ్వాసం, దూకుడైన బ్యాటింగ్ శైలి భారత జట్టుకు బలమని పేర్కొన్నాడు. ప్రపంచకప్‌లో భారత్, పాకిస్థాన్ ఇప్పటివరకు ఎనిమిది సార్లు తలపడగా, అన్ని మ్యాచ్‌ల్లోనూ భారత్‌దే విజయం. 1983, 2011 తర్వాత 2027లోనూ భారత్ ప్రపంచకప్ గెలవాలని రైనా ఆకాంక్షించాడు.

# మీరు ఏ కాఫీ తాగుతారు?.. డీకాఫ్‌తో జ్ఞాపకశక్తి, కెఫిన్‌తో ఆందోళన మాయం!

డీకాఫ్ కాఫీతో జ్ఞాపకశక్తి, అభ్యసన సామర్థ్యం మెరుగు - కెఫిన్ ఉన్న కాఫీతో ఆందోళన తగ్గి, చురుకుదనం పెరుగుదల

రెండు రకాల కాఫీలూ ఒత్తిడి, డిప్రెషన్‌ను తగ్గించగలవని వెల్లడి

పేగు-మెదడు వ్యవస్థపై కాఫీ ప్రభావంపై ఐర్లాండ్ శాస్త్రవేత్తల అధ్యయనం

కాఫీలోని కెఫిన్ యేతర అంశాలూ ఆరోగ్యానికి మేలు చేస్తాయని నిర్ధారణ



కాఫీ ప్రియులకు శుభవార్త. మీరు తాగేది కెఫిన్ ఉన్న కాఫీ అయినా, లేని డీకాఫినేటెడ్ (డీకాఫ్) కాఫీ అయినా ఆరోగ్యానికి మేలు చేస్తుందని ఓ తాజా అధ్యయనం స్పష్టం చేసింది. అయితే, ఈ రెండు రకాల కాఫీలూ వేర్వేరు ప్రయోజనాలను అందిస్తాయని ఐర్లాండ్‌కు చెందిన పరిశోధకులు గుర్తించారు. డీకాఫ్ కాఫీ తాగడం వల్ల జ్ఞాపకశక్తి, అభ్యసన సామర్థ్యం మెరుగుపడగా, కెఫిన్‌తో కూడిన కాఫీ ఆందోళనను తగ్గించి, అప్రమత్తతను పెంచుతుందని తేలింది. ఐర్లాండ్‌లోని యూనివర్సిటీ కాలేజ్ కార్క్‌కు చెందిన ఏపీసీ మైక్రోబయోమ్ పరిశోధకులు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. దీనికి సంబంధించిన వివరాలు ప్రముఖ సైన్స్ జర్నల్ 'నేచర్ కమ్యూనికేషన్స్'లో ప్రచురితమయ్యాయి. ఈ పరిశోధనలో భాగంగా రోజూ మూడు నుంచి ఐదు కప్పుల కాఫీ తాగే అలవాటున్న 62 మందిని ఎంపిక చేసుకున్నారు. ముందుగా వారిని రెండు వారాల పాటు కాఫీకి పూర్తిగా దూరంగా ఉంచారు. ఆ తర్వాత వారిని రెండు బృందాలుగా విభజించి, ఒక బృందానికి కెఫిన్ ఉన్న కాఫీని, మరో బృందానికి డీకాఫ్ కాఫీని ఇచ్చారు. ఆసక్తికరంగా రెండు గ్రూపుల వారూ కాఫీ తాగడం తిరిగి ప్రారంభించాక తమలో ఒత్తిడి, డిప్రెషన్, ఆవేశపూరిత ప్రవర్తన తగ్గినట్లు తెలిపారు. దీనిని బట్టి కాఫీ వల్ల కలిగే కొన్ని మానసిక ప్రయోజనాలు కేవలం కెఫిన్‌పైనే ఆధారపడి ఉండవని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ముఖ్యంగా డీకాఫ్ కాఫీ తాగిన వారిలో జ్ఞాపకశక్తి గణనీయంగా మెరుగుపడినట్లు గమనించారు. మరోవైపు, కెఫిన్ కాఫీ తాగిన వారిలో ఆందోళన స్థాయిలు తగ్గడంతో పాటు, చురుకుదనం, ఏకాగ్రత పెరిగాయి. కాఫీ తాగే వారి పేగుల్లోని కొన్ని రకాల బ్యాక్టీరియాలో మార్పులు చోటుచేసుకున్నాయని కూడా ఈ అధ్యయనం గుర్తించింది. ఈ పరిశోధన ప్రధాన రచయిత ప్రొఫెసర్ జాన్ క్రయాన్ మాట్లాడుతూ.. "కాఫీలోని అంశాలు పేగుల్లోని సూక్ష్మజీవులతో చర్య జరపడం ద్వారా మన ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. కెఫిన్ ఉన్నా లేకున్నా కాఫీలోని పాలిఫెనాల్స్ వంటి ఇతర సమ్మేళనాలు కూడా ఆరోగ్యానికి విభిన్న రీతుల్లో మేలు చేస్తాయని ఈ ఫలితాలు చూపిస్తున్నాయి" అని వివరించారు. మొత్తంగా ఈ అధ్యయనం కాఫీకి, పేగు-మెదడు అనుసంధానానికి మధ్య ఉన్న సంబంధాన్ని స్పష్టం చేస్తూ కొత్త విషయాలను వెలుగులోకి తెచ్చింది.

# శీతాకాలంపై ఎల్‌నినో ప్రభావం.. అక్టోబర్‌లో ఎండలే!

ఎల్‌నినో ప్రభావంతో ఈసారి శీతాకాలంలో చలి తక్కువ

అక్టోబర్‌లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు

తెలంగాణలో 18 శాతం వర్షపాతం లోటు నమోదు

ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయన్న ప్రపంచ వాతావరణ సంస్థ

వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు ఎల్‌నినో ప్రభావం



ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది శీతాకాలంలో చలి తీవ్రత తక్కువగా ఉండనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) స్పష్టం చేసింది. వర్షాకాలం ముగిసి, అక్టోబర్ 1 నుంచి దేశంలో శీతాకాలం అధికారికంగా ప్రారంభమైందని తెలిపింది. అయితే, అక్టోబర్ నెలలో మాత్రం చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు, తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. దేశవ్యాప్తంగా అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలంలో చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం ఉంటుందని ఐఎండీ పేర్కొంది. అయితే, వాయవ్య భారతంతో పాటు దక్షిణ ద్వీపకల్పంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం సాధారణం నుంచి అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది.

### తెలంగాణలో వర్షపాతం లోటు

ఇటీవల ముగిసిన వర్షాకాలంలో తెలంగాణలో 18 శాతం వర్షపాతం లోటు నమోదైంది. ముఖ్యంగా నల్గొండ, నిర్మల్, జోగులాంబ గద్వాల, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో అత్యధిక లోటు కనిపించిందని వాతావరణ శాఖ వెల్లడించింది. తాజా అంచనాల నేపథ్యంలో రాష్ట్రంలో రాబోయే రోజుల్లోనూ వర్షాభావ పరిస్థితులు కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి.

### ప్రపంచవ్యాప్తంగా ఇదే పరిస్థితి

పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో మరింత బలపడుతోందని, దీని ప్రభావం వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగుతుందని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) కూడా హెచ్చరించింది. దీని ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరిగి, వాతావరణంలో పెను మార్పులు సంభవిస్తాయని తెలిపింది.

ఈ నేపథ్యంలో వ్యవసాయం, నీటిపారుదల, ఆరోగ్యం, ఇంధన రంగాల్లో తలెత్తే సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వాలు సిద్ధంగా ఉండాలని డబ్ల్యూఎంవో సెక్రటరీ జనరల్ సెలెస్ట్ సాలో సూచించారు. కాగా, దేశంలో 2026 నైరుతి రుతుపవనాలు 12.6 నుంచి 13 శాతం లోటుతో ముగిశాయి. 2001 తర్వాత ఇంత తక్కువ వర్షపాతం నమోదు కావడం ఇది నాలుగోసారి.

# పప్పులో విస్కీ.. దాల్ మఖనీకి విస్కీ తాళింపు..

హైదరాబాద్‌లో వైరల్ అవుతున్న 'దాల్ విస్కీ' వంటకం!

దాల్ మఖనీకి విస్కీ నెయ్యితో మంటలు చెలరేగేలా తాళింపు

సోషల్ మీడియాలో ఈ వంటకం తయారీ వీడియోపై మిశ్రమ స్పందన

కొందరు సృజనాత్మకతను మెచ్చుకుంటుంటే, మరికొందరు విమర్శలు

సంప్రదాయ వంటకానికి ఆధునిక టచ్ ఇవ్వడంపై ఫుడ్ లవర్స్‌లో చర్చ



సోషల్ మీడియాలో ఎప్పుడు ఏది ట్రెండ్ అవుతుందో చెప్పడం కష్టం. ముఖ్యంగా ఫుడ్ విషయంలో రోజూ కొత్తకొత్త ప్రయోగాలు పుట్టుకొస్తూనే ఉంటాయి. తాజాగా, హైదరాబాద్‌లోని ఓ రెస్టారెంట్ అందిస్తున్న 'దాల్ విస్కీ' అనే వినూత్న వంటకం నెట్టింట హల్‌చల్ చేస్తోంది. సంప్రదాయ ఉత్తర భారత వంటకమైన దాల్ మఖనీకి విస్కీ ఫ్లేవర్‌ను జోడించి అందిస్తున్న ఈ డిష్, ఇప్పుడు ఫుడ్ లవర్స్‌లో తీవ్ర చర్చకు దారితీసింది. హైదరాబాద్‌లోని 'విస్కీ సాంబ' అనే రెస్టారెంట్‌లో ఈ ప్రత్యేకమైన వంటకాన్ని సర్వ్ చేస్తున్నారు. అందరికీ సుపరిచితమైన దాల్ మఖనీని తయారుచేసి, కస్టమర్ల టేబుల్ వద్దకే తీసుకొచ్చి, దానికి ప్రత్యక్షంగా తాళింపు పెడతారు. బాగా వేడి చేసిన స్వచ్ఛమైన నెయ్యిలో ఎండు మిరపకాయలు వేసి, ఆపై రెస్టారెంట్ సిగ్నేచర్ విస్కీని కొద్దిగా పోస్తారు. దీంతో ఒక్కసారిగా మంటలు (ఫ్లాంబే) చెలరేగుతాయి. మంటలతో కూడిన ఆ తాళింపును నేరుగా దాల్ మఖనీపై పోస్తారు. ఈ మొత్తం ప్రక్రియను కస్టమర్లు ప్రత్యక్షంగా చూడవచ్చు. అనంతరం వేడివేడిగా కుల్చాతో దీనిని అందిస్తారు. ఈ వంటకం తయారీకి సంబంధించిన వీడియోను కొందరు కంటెంట్ క్రియేటర్లు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఇది క్షణాల్లో వైరల్‌గా మారింది. దీనిపై నెటిజన్ల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. కొంతమంది ఈ సృజనాత్మకతను మెచ్చుకుంటూ, "చాలా ఆసక్తికరంగా ఉంది", "ఈ అనుభవం అద్భుతం" అని కామెంట్లు పెడుతున్నారు. "మన భారతీయుల క్రియేటివిటీ మామూలుగా ఉండదు" అని మరికొందరు ప్రశంసించారు. అయితే, ఈ ప్రయోగాన్ని అందరూ స్వాగతించడం లేదు. "ఆ కొద్దిపాటి విస్కీని పప్పులో వేయడం కంటే తాగడమే మేలు" అని ఒకరు వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. "విస్కీ కలపడం వల్ల అసలైన దాల్ మఖనీ రుచి పాడైపోదా?" అని మరో ఫుడ్ లవర్ ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తం మీద, ఒక సంప్రదాయ వంటకానికి ఆధునిక హంగులు, ముఖ్యంగా విస్కీ వంటి ఆల్కహాల్‌ను జోడించడం ఫుడ్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఫ్యూజన్ వంటకం కొందరికి నచ్చుతున్నా, మరికొందరిని ఆశ్చర్యపరుస్తోంది.

# ఆసియా క్రీడల్లో భారత్‌కు మరో స్వర్ణం..

44 ఏళ్ల నిరీక్షణకు తెరదించిన మహిళల హాకీ టీమ్

ఆసియా గేమ్స్ మహిళల హాకీలో భారత్‌కు స్వర్ణ పతకం

ఫైనల్లో చైనాపై 1-0 తేడాతో ఉత్కంఠభరిత విజయం

2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించిన భారత్



భారత మహిళల హాకీ జట్టు అద్భుతం చేసింది. ఏళ్ల తరబడి ఊరిస్తున్న ఆసియా గేమ్స్ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. ఏకంగా 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ శుక్రవారం జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ చైనాను ఓడించి పసిడి పతకాన్ని ముద్దాడింది. ఈ చారిత్రాత్మక విజయంతో భారత క్రీడా ప్రపంచంలో సంబరాలు అంబరాన్నంటాయి. అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు 1-0 తేడాతో చైనాపై గెలుపొందింది. ఆట తొలి క్వార్టర్‌లోనే లాల్‌రెమ్‌సియామి హ్మార్జోతే అద్భుతమైన ఫీల్డ్ గోల్ చేసి భారత్‌కు ఆధిక్యాన్ని అందించింది. ఆ తర్వాత చైనా గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ, భారత రక్షణ శ్రేణి గోడలా నిలిచింది. ముఖ్యంగా, గోల్ కీపర్ సవితా పూనియా ఒక కీలకమైన పెనాల్టీ స్ట్రోక్‌ను అడ్డుకుని జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. చివరి నిమిషం వరకు ఆధిక్యాన్ని కాపాడుకున్న భారత అమ్మాయిలు చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేశారు. భారత మహిళల హాకీ జట్టుకు ఆసియా క్రీడల్లో ఇది రెండో స్వర్ణం మాత్రమే. చివరిసారిగా 1982లో న్యూఢిల్లీలో జరిగిన ఆసియా గేమ్స్‌లో భారత్ స్వర్ణం సాధించింది. మళ్లీ ఇన్నేళ్లకు ఆ ఘనతను పునరావృతం చేసింది. ఈ విజయంతో భారత జట్టు 2028లో జరగనున్న లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించడం మరో విశేషం. ఈ టోర్నీలో అద్భుత ప్రదర్శన కనబరిచిన భారత జట్టు, ఫైనల్‌కు ముందు సెమీఫైనల్లో దక్షిణ కొరియాపై 2-0 తేడాతో గెలిచిన విషయం తెలిసిందే. ఈ చారిత్రాత్మక విజయంపై క్రీడా లోకం హర్షం వ్యక్తం చేస్తోంది. కాగా, తాజా స్వర్ణంతో ఈ ఆసియా క్రీడల్లో భారత్ బంగారు పతకాల సంఖ్య 16కి పెరిగింది.

# సినిమా న్యూస్

## 'సిగ్మా' - మూవీ రివ్యూ!

హీరో విజయ్ తనయుడు జేసన్ సంజయ్ హీరోగా ఎంట్రీ ఇస్తాడని ఆయన అభిమానులు భావిస్తే, అందుకు భిన్నంగా ఆయన మెగాఫోన్ పట్టుకున్నాడు. సందీప్ కిషన్ హీరోగా ఒక సినిమాను రూపొందించాడు .. ఆ సినిమా పేరే 'సిగ్మా'. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మితమైన ఈ సినిమా, తమన్ సంగీతాన్ని సమకూర్చాడు. ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటించిన ఈ సినిమా, ఈ రోజునే థియేటర్లకు వచ్చింది.

గురు (సందీప్ కిషన్) తల్లిదండ్రులను కోల్పోయిన ఓ అనాథ. తనని చేరదీసిన డాక్టర్ 'నీల్' (రాజు సుందరం)తో అతను ఎంతో సన్నిహితంగా ఉంటాడు. తండ్రి చేసిన అప్పులు అతనిని సతమతం చేస్తుంటాయి. అందుకు అవసరమైన డబ్బులను ఎలా సర్దుబాటు చేయాలో తెలియక తికమక పడుతుంటాడు. ఆ ఇంట్లో తల్లికి సంబంధించిన ఒక పాత లైబ్రరీ ఉంటుంది. ఆమెకి గుర్తుగా అతను ఆ లైబ్రరీని కాపాడుకుంటూ వస్తుంటాడు. ఆ లైబ్రరీని ఉపయోగించుకుని 'ఆడియో బుక్ ఛానల్' ను ఏర్పాటు చేయాలనే ఒక ఆలోచన చేస్తాడు.

ఆడియో బుక్ ఛానల్ కి లేడీ వాయిస్ అయితే బాగుంటుందనే ఉద్దేశంతో, ఆర్జేగా పనిచేస్తున్న 'సామ్' (ఫరియా అబ్దుల్లా)ను 'గురు' సంప్రదిస్తాడు. అలా వాళ్లిద్దరి మధ్య పరిచయం మొదలవుతుంది. అప్పు తీర్చకపోతే ఆ ఇంటిని సొంతం చేసుకుంటామని అప్పులవాళ్లు 'గురు'ను హెచ్చరిస్తారు. దాంతో ఎలాగైనా సాధ్యమైనంత త్వరగా పెద్ద మొత్తంలో సంపాదించాలని నిర్ణయించుకుంటాడు. క్లబ్ లో జూదమాడి 'విన్సెంట్'తో గెంటివేయబడతాడు.

వీరయ్య రెడ్డి (సంపత్ రాజ్) ఏనుగు దంతాలు .. పులిచర్మాలు అక్రమ రవాణా చేస్తూ కోట్ల రూపాయలు సంపాదిస్తూ ఉంటాడు. వెయ్యికోట్ల రూపాయలను అతను ఒక ఒక ఐరన్ బాక్స్ లో పెట్టేసి .. ఆ బాక్స్ కి సంబంధించిన 'కీ' ప్లస్ 'పెన్ డ్రైవ్'ని తన దగ్గర పెట్టుకుంటాడు. అనుకోకుండా ఆ 'కీ' 'గురు' ఇంటికి చేరుతుంది. ఆ 'కీ' కోసం ఒక వైపున వీరయ్యరెడ్డి .. మరో వైపున విన్సెంట్ మనుషులు వెతకడం మొదలు పెడతారు. చివరికి అది ఎవరికి చిక్కుతుంది? ఆ వెయ్యికోట్ల సంపద ఎవరికి దక్కుతుంది? అనేదే కథ.

'గురు' తన తండ్రి చేసిన అప్పు తీర్చడం కోసం, తల్లికి ఇష్టమైన ఇంటిని వదులుకోవలసి వస్తుంది. అది ఎంతమాత్రం ఇష్టం లేని గురు, ఆ మొత్తాన్ని సాధించి తీరాలనే పట్టుదల కలుగుతుంది. అప్పుడే అతనికి వెయ్యి కోట్లకు సంబంధించిన ఒక టాస్క్ ఎదురవుతుంది. ఆ డబ్బును దక్కించుకోవడం కోసం అతను ఏం చేస్తాడు? ఎలాంటి సవాళ్లను దాటుకుంటూ వెళతాడు? అనే అంశం చుట్టూ దర్శకుడు ఈ కథను అల్లుకుంటూ వెళ్లాడు.

గురు అతని స్నేహితుడు .. లవర్ కలిసి ఒక గ్యాంగ్ గా .. వీరయ్య రెడ్డి గ్యాంగ్ .. విన్సెంట్ గ్యాంగ్ .. తెరపై కనిపిస్తాయి. కథ మొత్తం ఈ మూడు గ్యాంగుల చుట్టూ తిరుగుతూ ఉంటుంది. ఈ మూడు గ్యాంగులు వెతుకులాడే ఒక 'కీ' చుట్టూ పరిగెడుతూ ఉంటుంది.




దర్శకుడు తాయారు చేసుకున్న కథ ప్రకారం ఈ కథలో మదర్ సెంటిమెంట్ ను అనుకున్నాడు. అలాగే హీరో పాత్ర చుట్టూ ఆర్థిక ఇబ్బందులను క్రియేట్ చేసి ఆడియన్స్ కి ఒక పెయిన్ ఉండేలా చూసుకున్నాడు. తనకి ఇప్పుడు పెద్ద మొత్తంలో డబ్బు అవసరం అనే ఒక పరిస్థితిని సృష్టించాడు. అందుకోసం హీరో రంగంలోకి దిగేలా చేశాడు. అయితే కథలోని అంశాలను ఆడియన్స్ కి ఎమోషనల్ గా కనెక్ట్ చేయలేకపోయాడు. ప్రతి అంశంలోను గాఢతను ఆవిష్కరించలేకపోయాడు.

వేయ్యి కోట్ల రూపాయలకు సంబంధించిన 'కీ' చేతులు మారుతూ వెళ్లడం .. దాని కోసం పెట్టే పరుగులు .. ఒకరిపై ఒకరు చేసుకునే దాడులు మామూలే. ఈ నేపథ్యంలోనే కామెడీని కూడా వర్కౌట్ చేయాలని దర్శకుడు అనుకున్నాడు. కానీ ఇక్కడ కూడా మిగతా విషయాలలో జరిగిన పొరపాటే జరిగింది. ఇక పాత సినిమాల మాదిరిగా పాత ఫ్యాక్టరీకి క్లైమాక్స్ ను తరలించారు. ఇక్కడైనా కొత్తగా ఏమైనా చూపిస్తారేమోనని అనుకున్న ఆడియన్స్ కి నిరాశనే ఎదురవుతుంది.

సందీప్ కిషన్ చాలా ఈజ్ తో చేశాడు. ఫరియా అబ్దుల్లా చాలా గ్లామరస్ గా మెరిసింది. ఇక సంపత్ రాజ్ విలనిజం ఆడియన్స్ కి సుపరిచితమే. అయితే ఆయన పాత్రలో పవర్ లోపించడం కనిపిస్తుంది. శివ్ పండిట్ విలనిజాన్ని కూడా తేల్చిపారేశారు. కేథరిన్ ఐటమ్ సాంగ్ కూడా పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. కృష్ణన్ వసంత్ ఫొటోగ్రఫీ .. తమన్ నేపథ్య సంగీతం ఈ కంటెంట్ ను నెక్స్ట్ లెవెల్ కి తీసుకుని వెళ్లడానికి తమవంతు ప్రయత్నం చేశాయి. ప్రవీణ్ ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తుంది.

సందీప్ కిషన్ - ఫరియా అబ్దుల్లా అనగానే, హైట్ పరంగా మంచి జోడీ అనిపిస్తుంది. కానీ తెరపై ఇద్దరి మధ్య లవ్ .. రొమాన్స్ గట్రా ఏమీ ఉండవు. తాము లవర్స్ అనే ఆలోచన వాళ్లకి లేదు .. ఆడియన్స్ కి అలాంటి అభిప్రాయం కలగనీయలేదు. లైకా ప్రొడక్షన్స్ అనగానే మనకి అర్థమైపోతుంది .. నిర్మాణ పరమైన విలువల విషయంలో రాజీ ఉండదని. అదే విషయాన్ని ఈ సినిమా మరోమారు నిరూపిస్తుంది. జేసన్ సంజయ్ ను నమ్మి గట్టిగానే ఖర్చు పెట్టారు.

కోట్ల రూపాయల డబ్బు .. ఆ డబ్బును దక్కించుకోవడం కోసం చేసే ముఠాలు ప్రయత్నాలు .. హీరో వైపు నుంచి కూడా సాగే పోరాటం నేపథ్యంలో గతంలో చాలానే సినిమాలు వచ్చాయి. ఎమోషన్స్ తో ముడిపెడుతూ భారీ యాక్షన్ దృశ్యాలతో ఆశ్చర్యపరిచిన సినిమాలు ఉన్నాయి. ఆ సినిమాలకి ఏ మాత్రం భిన్నంగా లేకుండా రొటీన్ గా తీసిన సినిమా ఇది. జేసన్ సంజయ్ దర్శకత్వం వహించిన తొలి సినిమా అనే ప్రత్యేకత తప్ప, మరే విధంగాను ప్రభావితం చేయలేకపోయిన సినిమా ఇది.

సినిమా వివరాలు
సినిమా పేరు: సిగ్మా
జానర్: యాక్షన్, క్రైమ్
విడుదల తేదీ: 2026-10-02
నటీనటులు: సందీప్ కిషన్,
ఫరియా అబ్దుల్లా, రాజు సుందరం,
సంపత్ రాజ్, శివ్ పండిట్, యోగ్ జపీ
దర్శకుడు: జాసన్ సంజయ్
పి.ఆర్.ఓ (ప్రా=హ): -
సంగీతం: తమన్ ఎస్
బ్యానర్: లైకా ప్రొడక్షన్స్
సమీక్షకుడు: పెద్దింటి
సిగ్మా రేటింగ్: 5కి 2.00

## 'నా వైఫ్ మిస్సింగ్'.. చాలాకాలం తర్వాత మళ్లీ జోడీగా వరుణ్ సందేశ్, శ్వేతా బసు




త్వరలోనే స్ట్రీమింగ్ తేదీని ప్రకటించనున్న ఆహా ఓటీటీ 'కొత్త బంగారు లోకం' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రసాద్ జంట చాలా కాలం తర్వాత మళ్లీ తెరపైకి రాబోతోంది. వీరిద్దరూ ప్రధాన పాత్రల్లో 'ఆహా' ఓటీటీ సమర్పిస్తున్న సరికొత్త ఒరిజినల్ సిరీస్ 'నా వైఫ్ మిస్సింగ్'.

వినూత్నమైన కంటెంట్‌తో సబ్‌స్క్రైబర్లను నిరంతరం ఆకట్టుకుంటున్న ఆహా, ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌తో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది.

భార్య కనపడటం లేదంటూ ఒక భర్త పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ కథ మొదలవుతుంది. ఈ కేసులో నిజమేంటి అనే అంశం చుట్టూ కథనం సాగుతుందని తెలుస్తోంది. ఇటీవల ఆహా విడుదల చేసిన అప్‌డేట్‌లో "ప్రతి కేసుకు ఒక కథ ఉంటుంది, ఈ కేస్ లో నిజం ఏంటి?" అనే క్యాప్షన్ ప్రేక్షకులలో క్యూరియాసిటీని మరింత పెంచింది. తన భార్య మిస్సయ్యిందంటూ వరుణ్ సందేశ్ కంప్లైంట్ ఇవ్వడం, దాని వెనుక ఉన్న రహస్యం ఏమిటనేది సిరీస్‌లో ఉత్కంఠభరితంగా చూపించనున్నారని సమాచారం.

వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రసాద్‌లది టాలీవుడ్‌లో ఒక సక్సెస్‌ఫుల్ పెయిర్. 'కొత్త బంగారు లోకం' తర్వాత వీరిద్దరూ కలిసి నటిస్తున్న ప్రాజెక్ట్ ఇదే కావడంతో సిరీస్‌పై అంచనాలు సహజంగానే పెరిగాయి. చాలా ఏళ్ల తర్వాత ఈ జంట మళ్లీ కలిసి నటించడం ఈ ప్రాజెక్ట్‌కు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది.

ఈ సిరీస్‌ను తెలుగుతో పాటు తమిళ భాషల్లో కూడా ఒకేసారి అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆహా ప్రకటించింది. మిస్సింగ్ కేసు వెనుక ఉన్న మిస్టరీ ఏంటి? నిజంగానే శ్వేతా బసు పాత్ర అదృశ్యమైందా? లేక దీని వెనుక ఇంకేదైనా కుట్ర ఉందా? అనే ప్రశ్నలకు సమాధానం తెలియాలంటే సిరీస్ చూడాల్సిందే. త్వరలోనే 'నా వైఫ్ మిస్సింగ్' స్ట్రీమింగ్ తేదీని అధికారికంగా ప్రకటిస్తామని ఆహా టీమ్ తెలిపింది.

## తెలుగులోకి 'హనుమాన్ అంశ్'.. రిలీజ్ డేట్ వచ్చేసింది!

ఆధ్యాత్మిక కథాంశంతో తెరకెక్కిన 'హనుమాన్ అంశ్' సినిమా బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్లు సాధిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే రూ.400 కోట్ల మార్క్‌ను దాటిన ఈ సినిమా.. ఎట్టకేలకు తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా తెలుగు వెర్షన్‌ను విడుదల చేయనున్నట్లు హోంబలే ఫిల్మ్స్ ప్రకటించింది. నిజానికి ఈ సినిమా తెలుగు వెర్షన్ సెప్టెంబర్ 18న విడుదల కావాల్సి ఉంది. దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌కు చెందిన ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ తెలుగు వెర్షన్‌ను సమర్పించనున్నట్లు తొలుత ప్రచారం జరిగింది. అయితే డీల్ కుదరకపోవడంతో త్రివిక్రమ్ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు సమాచారం. సెప్టెంబర్ 15న హైదరాబాద్‌లో తెలుగు టీజర్‌ను విడుదల చేసేందుకు ఏర్పాట్లు కూడా చేశారు. అయితే చివరి నిమిషంలో ఆ కార్యక్రమం రద్దయింది.

అక్టోబర్ 9న తెలుగు వెర్షన్ విడుదల
సెప్టెంబర్ 18న విడుదల వాయిదా
హోంబలే ఫిల్మ్స్ తెలుగు రిలీజ్ బాధ్యతలు
భారత్‌లో రూ.300 కోట్లకు పైగా నెట్ వసూళు
నీమ్ కరోలి బాబా జీవిత ప్రేరణతో సినిమా

ఇప్పుడు హోంబలే ఫిల్మ్స్ స్వయంగా తెలుగు విడుదల బాధ్యతలను తీసుకుంది.

కేవలం రూ.1.8 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కినట్లు చెబుతున్న ఈ సినిమా.. సెప్టెంబర్ 28 నాటికి భారత్‌లో రూ.300 కోట్లకు పైగా నెట్ వసూళ్లు సాధించింది. 52వ రోజుకు ఈ మార్క్‌ను అందుకుంది. ప్రపంచవ్యాప్తంగా రూ.400 కోట్లకు పైగా వసూళ్లు రావడంతో చిత్రబృందం ఆనందం వ్యక్తం చేస్తోంది. విశాల్ చతుర్వేది దర్శకత్వం వహించిన ఈ సినిమా.. నీమ్ కరోలి బాబా జీవిత ప్రేరణతో తెరకెక్కిన ఆధ్యాత్మిక కథ. లక్ష్మీ నారాయణ్ అనే వ్యక్తి ఆధ్యాత్మిక మార్గంలోకి వెళ్లి ప్రముఖ సాధువుగా ఎలా మారాడన్నదే కథ. నీమ్ కరోలి బాబా పాత్రలో శోభినవ్ సత్యా నటించారు. విహాన్ షెదెగే, పూర్ణిమ తివారీతో పాటు పలువురు కీలక పాత్రల్లో కనిపించారు.

## రజనీకాంత్ 'జైలర్ 2' ట్రైలర్‌కు ముహూర్తం ఖరారు..

పండగకు ముందే రానున్న టైగర్!

అక్టోబర్ 5న 'జైలర్ 2' అధికారిక థియేట్రికల్ ట్రైలర్ విడుదల

అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న సినిమా

'టైగర్' ముత్తువేల్ పాండియన్ పాత్రలో మరోసారి రజనీకాంత్

ప్రత్యేక అతిథి పాత్రల్లో మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, విజయ్ సేతుపతి




అనిరుధ్ సంగీతంలో ఇప్పటికే విడుదలైన 'హుకుమ్ రీలోడెడ్' థీమ్ సాంగ్ సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న 'జైలర్ 2' సినిమాకు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చేసింది. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ అధికారిక థియేట్రికల్ ట్రైలర్‌ను అక్టోబర్ 5, 2026న విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అధికారికంగా ప్రకటించింది. బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన 'జైలర్'కు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో, కళానిధి మారన్ సమర్పణలో సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఇప్పటికే యూట్యూబ్‌లో ఈ సినిమా పేరుతో అనేక ఫ్యాన్-మేడ్, కాన్సెప్ట్ ట్రైలర్లు చక్కర్లు కొడుతున్న నేపథ్యంలో, అక్టోబర్ 5న రాబోయేది అఫీషియల్ ట్రైలర్ అని మేకర్స్ స్పష్టతనిచ్చారు. ఈ చిత్రంలో రజనీకాంత్ మరోసారి తన ఐకానిక్ 'టైగర్' ముత్తువేల్ పాండియన్ పాత్రలో కనిపించి ప్రేక్షకులను అలరించనున్నారు.

ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ అందిస్తున్న సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఇప్పటికే విడుదలైన 'హుకుమ్ రీలోడెడ్' థీమ్ సాంగ్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. తారాగణం పరంగా కూడా ఈ సీక్వెల్ మరింత భారీగా ఉండనుంది. ఎస్.జె. సూర్య, విద్యాబాలన్, మిథున్ చక్రవర్తి ముఖ్య పాత్రలు పోషిస్తుండగా, తొలి భాగంలో అదరగొట్టిన మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్‌లతో పాటు ఈసారి విజయ్ సేతుపతి కూడా ప్రత్యేక అతిథి పాత్రలో మెరవనున్నారు. దీంతో 'జైలర్ 2'పై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662